RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

సంచిక 45 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | ఆగస్టు 13, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆకలవసరములు కాకికి ,కాకకు
ఒక్కటేను సుమ్ము నిక్కమిదియె
వాలిపోవునంట వసుధన జూడగా
తీరగానె తిరుగు దారిపట్టు
కాక= మనిషి అని
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.




## మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

**- ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ ఆవిష్కరించిన మోడీ**

**న్యూఢిల్లీ,ఆగస్టు 12 :** భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయం ఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గద ర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని మిగతా2లో...

## డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లు

**మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను ఎట్టి పరిస్థితిలో సహించం**
**డిఫాల్టర్ల మిల్లులను మహిళలకు అప్పగించాలి**
**పౌరసరఫరాల శాఖ సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం**



**హైదరాబాద్,ఆగస్టు 12 :** సివిల్ సప్లయిస్ శాఖలో డిఫాల్ట్ అయిన రైస్‌మిల్లర్ల నుంచి బకాయిలను వసూల్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉద్దేశ పూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. బకాయిల వసూళ్లకు ఒక విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. కేబినెట్ సబ్‌కమిటీలో దీనిపైన చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలని మార్గనిర్దేశంచేశారు. మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించనని హెచ్చరించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మార్కెట్‌లో ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశిరచారు.

మిగతా2లో...



## నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

**వాటాల్లో బిఆర్ఎస్ వల్లే తెలంగాణకు నష్టం**
**అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కెటిఆర్**
**మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,ఆగస్టు 12 :** తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో

మిగతా2లో...

## తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి

**- ఇళ్ల కేటాయింపులో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వండి**
**- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌కు పొంగులేటి వినతి**



2లో

## చర్చకు నేను సిద్ధం.. అన్ని ప్రశ్నలకూ సమాధానమిస్తా: అమిత్‌షా



**న్యూఢిల్లీ,ఆగస్టు 12 :** పార్లమెంట్‌లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం

మిగతా2లో...



2లో

## ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మేడిగడ్డ పునరుద్ధరణ

**- గూడెందొడ్డి పంప్ స్టోరేజీ ప్రాజెక్టుపై కన్సల్టెన్సీ నియామకం**
**- ప్రాజెక్టుల పరిహారం.. పునరావాసం వేగవంతం**
**- గరిష్ట స్థాయిలో గోదావరి జలాల వినియోగం..నీటి పారుదల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**

## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

**మేం టి హబ్‌ను తెస్తే..**
**వారు అనుముల హబ్స్‌తో దోపిడీ**
**మరోమారు ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు**



**హైదరాబాద్,ఆగస్టు 12 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతు న్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్‌ను 'ను నిర్మిస్తే... మిగతా2లో...

## టాటా సన్స్ ఛైర్మన్ పదవికి చంద్రశేఖరన్ రాజీనామా

**- ఆరు నెలల ముందే తప్పకున్న చంద్రశేఖరన్**



**న్యూఢిల్లీ,ఆగస్టు 12 :** టాటా సన్స్ చైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా చేశారు. ఈ సంస్థ చైర్మన్ పదవిని తాను మరోసారి కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఆగస్టు 18వ తేదీన ఆ సంస్థ సర్వసభ్య సమావేశం జరగనుంది. అందుకు కొద్ది రోజుల ముందు చంద్రశేఖరన్

మిగతా2లో...

## జింబాబ్వేలో ఘోర ప్రమాదం..

**- పడవ బోల్తాపడి 44 మంది దుర్మరణం**



**హరారే:ఆగస్టు 12 :** జింబాబ్వేలోని కరీబా సరస్సులో ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న పడవ ఒక్కసారిగా బోల్తా పడటంతో సుమారు 44 మంది మృతి చెందారు. పలువురి జాడ గల్లంతైంది. 67 మందిని సహాయక సిబ్బంది కాపాడింది.

మిగతా2లో...

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# చర్చకు నేను సిద్ధం.. అన్ని ప్రశ్నలకూ సమాధానమిస్తా: అమిత్‌షా

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధంగా ఉందని అన్నారు. బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్‌కు వస్తున్నాను. నా ఛాంబర్‌లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారని అన్నారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు.అమిత్‌షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'విద్యార్థులపై లాఠీచార్జ్ ఎవరు చేశారు. కాల్పులకు ఆదేశించింది ఎవరు?. 20 రోజులుగా అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదు. పార్లమెంట్ ముగిసే సమయానికి అమిత్‌షా డ్రామాలు ఆడుతున్నారు' అంటూ రాహుల్ మండిపడ్డారు.

# నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరవుతామని తెలిపారు. నీటీ వాటాపై బలంగా కొట్లాడుతామని పేర్కొన్నారు. అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. తాము కోటిన్నర రూపాయిలకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. 5 ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు. కేటీఆర్ చెబుతున్న రూ. 200 కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కేటీఆర్‌కు మంచిది కాదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి హితవు పలికారు. రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్‌బాబు.. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని.. పారిశ్రామికవేత్త లను భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపవద్దని ఆయనకు సూచించారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేద పేర్కొన్నారు. అందుకే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

# తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి

**న్యూఢిల్లీ,ఆగస్టు 12 :** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి . రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా పొంగులేటి గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్ 2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ ఉందని తెలిపారు. ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బ్జడెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాలని పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి ఖఓంజ–ఉ 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు.

అది చరిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్?2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు.

తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున, ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. ఇకపోతే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు.

# ఎన్డీఎస్‌ఏ సూచనల మేరకే మేడిగడ్డ పునరుద్ధరణ

**హైదరాబాద్,ఆగస్టు 12 :** జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీటి నిల్వ చేయడంతో పాటు పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు బ్యారేజీల్లో తేలిన సాంకేతిక లోపాలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సీఎంకు వివరించిన సందర్భంలో సీఎం మాట్లాడుతూ.. సొంత నిర్ణయాలు తీసుకుకోకుండా నిపుణుల సలహా మేరకే ముందుకెళ్లాలని వారికి సూచించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హె చ్ఆర్డీ)లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అందుబాటులో ఉన్న గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే వాటి పరిష్కారంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం సూచించారు.

గోదావరి జలాలు సముద్రంలో కలవకుండా సాధ్యమైనంత వరకు ఎత్తి పోసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ఏడాది సాగు, తాగు నీరుకు ఇబ్బందులు లేకుండా నీటి పారుదల శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలన్నారు.

రాష్ట్రంలో చివరి దశలో ఉన్న పలు ప్రాజెక్టుల కింద కొన్ని గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులు, ఆస్తులు కోల్పోయిన ప్రజలకు పరిహారం చెల్లింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు వాస్తవ పరిస్థితి, పరిహారం, పునరావాసానికి సంబంధించి నివేదిక రూపొందించాలన్నారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిన చిన్న చిన్న పనులు పూర్తి చేస్తే నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల పథకం సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సేకరించాల్సిన భూమి, పరిహారం, ఇతర అంశాలపై నివేదిక రూపొందించాలన్నారు. గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్ ను నియమించాలని ఆదేశించారు.

కన్సల్టెంట్ నియామకంలో నైపుణ్యం, గత చరిత్రను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేయాలన్నారు. గోదావరి, కృష్ణా బేసిన్లలోని ఆయకట్టు కింద ఉన్న రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఆర్అండ్ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మాజీ రాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఒకే దేశం–ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి. ఆయన జీవిత అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ల నుంచి దేశ యువత ఎంతో నేర్చుకోవచ్చు. ఆయన ఆలోచనలు, అనుభవాలను కొత్త తరం తెలుసుకోవాలి. పుస్తకానికి ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ అనే పేరు పెట్టడం ఎంతో సముచితం. కోవింద్ జీవితంలో ఎదురైన పోరాటాలు వ్యక్తిగతమైనవే కానీ. వాటి ఫలితంగా సాధించిన విజయం మాత్రం భారత గణతంత్రానికి, దేశ ప్రజాస్వామ్యానికే చెందుతుందన్న సందేశం ఈ శీర్షికలో ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు.

# టాటా సన్స్ ఛైర్మన్ పదవికి చంద్రశేఖరన్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామా చేయడం ప్రాముఖ్యత సంతరించుకుంది. టాటా గ్రూప్‌లో తాను 40 ఏళ్ల పాటు వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు సేవలందించడం ద్వారా సంతృప్తికరమైన అవకాశం లభించిందన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా టాటా సన్స్‌కు నాయకత్వం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇది అపారమైన బాధ్యత అని అభివర్ణించారు. వారసత్వంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా టాటా బోర్డుకు ఆయన విజ్ఞప్తి చేశారు. 2027, ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఆయన పదవి కాలం ఉంది. కానీ కొన్ని నెలల మందే ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో టాటా సంస్థ షేర్లు దాదాపు 5 శాతం మేర పడిపోయాయి.గతంలో చంద్రశేఖరన్ టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేశారు. 2017లో టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ నియమితులయ్యారు. నాటి నుంచి ఆయన అదే పదవిలో కొనసాగుతున్నారు. అయితే ఈ సంస్థ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్‌ను మళ్లీ నియమించడంపై టాటా సన్స్, టాటా ట్రస్ట్ మధ్య వివాదం నెలకొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారని తెలుస్తోంది. టాటా గ్రూప్ సంస్థలో స్టీల్, మోటర్స్, టీసీఎస్, ఇండియన్ హోటల్స్ ఉన్నాయి. ఎన్ చంద్రశేఖరన్ ఇప్పటి వరకు వీటికి ఛైర్మన్‌గా వ్యవహరించారు.

# జింబాబ్వేలో ఘోర ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

అమ్ముడయిన టిక్కెట్ల ఆధారంగా ప్రమాద సమయంలో ఐదుగురు సిబ్బందితో సహా 114 మంది ప్రయాణిస్తున్నట్టు తెలిసిందని, టిక్కెట్ల ఏజ్‌కు దిగువనున్న పిల్లల సంఖ్య తెలియాల్సి ఉందని జింబాబ్వే ప్రొటక్షన్ యూనిట్ ఒక ప్రకటనలో తెలిపింది.కాగా, పడవ సామర్థ్యం 90 మందికే సరిపోతుందని, ఎక్కువ మందిని ఎక్కించుకోవలడం వల్ల ప్రమాదం జరిగినట్టు అనుమానిస్తున్నామని జాతీయ విపత్తుల నిర్వహణ ఏజెన్సీ తెలిపింది. ప్రస్తుతం గల్లంతైన ప్రయాణికుల కోసం ముమ్మరంగా గాలింపు చర్చలు జరుగుతున్నాయి. ప్రమాదానికి స్పష్టమైన కారణాలు, గల్లంతైన వారి సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉందని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. జింబాబ్వే–జాంబియా సరిహద్దులో కరీబా సరస్సు ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజలు కరీబా పట్టణానికి వెళ్లేందుకు పడవలు ఉపయోగిస్తుంటారు.

# కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ,ఆగస్టు 12:**

కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా కేరళంగా మార్చే ప్రక్రియలో మరో కీలక అడుగు పడింది. కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ బిల్లు ఆమోదం పొందింది. 'కేరళ బిల్లు–2026'ను లోక్‌సభ మంగళవారం ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించింది. రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ కేరళ శాసనసభ 2024లో తీర్మానం చేసింది. మలయాళంలో రాష్ట్రాన్ని సాధారణంగా 'కేరళం'గా పిలుస్తుండగా, రాజ్యాంగంలోని అధికారిక పేరు మాత్రం 'కేరళ' అనే కొనసాగుతోంది.

# రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీ–రన్.. ఫ్యామిలీ–డ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంఎ÷–లాయిన్స్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకోవచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుముల హబ్' అవకాశాన్ని కల్పించండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల్లో గోదాంల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలని సూచించారు. గోదాంల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను వినియోగించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# మహారాష్ట్ర సిఎస్‌తో సంజయ్ జాజు భేటీ

## - తెలంగాణ అభివృద్ధి తదితర అంశాలపై చర్చ

**హైదరాబాద్,ఆగస్టు 12 :** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రగతి, 'రైజింగ్ తెలంగాణ 2047' విజన్ తదితర అంశాలను వివరించారు. తెలంగాణ–మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఉన్న సత్సం బంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, పరస్పర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎండి సి.ఎస్. శెట్టిను ముంబైలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, 'రైజింగ్ తెలంగాణ 2047' లక్ష్యాలు తదితర అంశాలను ఆయన ఎస్‌బీఐ సీఎండీకి వివరించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సంజయ్ జాజు వివరించారు.

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



పెద్దపల్లి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు ఆర్నకొండ సాయి ఆజాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్య అతిథిగా హాజరై శ్వేత--అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1936లో లక్నోలో ఏర్పడిన ఏఐఎస్ఎఫ్ దేశంలో తొలి విద్యార్థి సంఘమని, విద్యార్థుల హక్కులు, ప్రభుత్వ విద్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు అండగా ఏఐఎస్ఎఫ్ జెండా ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.జిల్లాలోని 14 మండలాల్లో శ్వేత--అరుణ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మనీషా, శ్రావణి, ఉర్మిళ, అశ్విని, స్వాతి, శ్రీయ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత మున్సిపల్ చైర్మన్



ఖానాపూర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధ ర్యాలీ నిర్వహించారు.మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు వాడకుండా పేపర్ బ్యాగులు, పర్యావరణానికి హాని కలిగించని వస్తువులను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కాలుష్యం పెరిగి అనేక సమస్యలు వస్తాయని, అందరూ కలిసి ప్లాస్టిక్ రహిత ఖానాపూర్ నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏళ్లుగా చీకటిలో ఉన్న ప్రాంతానికి వెలుగులు



ఖానాపూర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :ఖానాపూర్ మున్సిపల్ 5వ వార్డులో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు బుధవారం వార్డు కౌన్సిలర్ మేస పోసమ్మ, నాయకుడు సతీష్ ఆధ్వర్యంలో వీధి దీపాలు అమర్చారు. గత కొన్ని ఏళ్లుగా చీకటిలో ఉన్న ప్రాంతానికి శాశ్వత పరిష్కారం లభించడంతో స్థానికులు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాల విద్య, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఖానాపూర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పాఠశాల విద్య మరియు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఖానాపూర్ తహశీల్దార్ సుజాతకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీ ఆందోళనలు కొనసాగుతున్నాయని తెలిపారు. పి.ఆర్.సి నివేదికను వెంటనే అమలు చేయాలని, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డి.ఎ. విడతలను విడుదల చేయాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పాఠశాలల మూసివేత ఆలోచనను విరమించుకోవాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఈ నెల 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 29న రాష్ట్ర రాజధానిలో భారీ నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాదవ్ వెంకటరావు, రాజేష్ నాయక్, క్రాంతి కుమార్, పరాంకుశం మురళీధర్, ఫాజిల్, అంజయ్యతో పాటు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిరాహార దీక్షకు మద్దతుగా జాతీయ పరిరక్షణ సమితి



గంగాధర, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని నారాయణపూర్ గ్రామాన్ని ముప్పు గ్రామంగా ప్రకటించాలని గ్రామ ప్రజలు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు జాతీయ పరిరక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డి కరుణాకర్ రెడ్డి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు నారాయణ, రాములు తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

## శాతవాహన పీజీ పరీక్షా కేంద్రాల తనిఖీ



కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న పీజీ ద్వితీయ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించేందుకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి. సురేష్ కుమార్‌తో కలిసి ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష గదులను సందర్శించి హాల్ టికెట్లు, సీటింగ్ ఏర్పాట్లు, హాజరు శాతం పరిశీలించారు. అనంతరం పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ చీఫ్ సూపరింటెండెంట్లకు కీలక సూచనలు చేశారు. పరీక్షలను పారదర్శకంగా, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, మాల్ ప్రాక్టీస్ లేదా కాపీయింగ్‌కు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయేలా చూడాలని ఆయన పేర్కొన్నారు.ఈ తనిఖీ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహణ



కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కరీంనగర్‌లో బీజేపీ శ్రేణులు ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహించారు.బిజెపి వెస్ట్ జోన్ అధ్యక్షుడు జాడి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీ డిఫెన్స్ స్కూల్ విద్యార్థులతో కలిసి జరిగిన ఈ ర్యాలీని జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 2022 నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తోందని, ప్రజలు తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకుంటున్నారని తెలిపారు. త్రివర్ణ పతాకం దేశ గౌరవానికి ప్రతీక అని, కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా అందరూ ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ యువతలో దేశభక్తి భావాలను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు.ఈ ర్యాలీలో జాతీయ జెండాలను చేతబూని నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "భారత్ మాతా కీ జై" నినాదాలతో నగరంలోని పలు ప్రాంతాలు మార్మోగాయి.కార్యక్రమంలో కోమల ఆంజనేయులు, ప్రవీణ్ రావు, గుజ్జ శ్రీనివాసరావు, బండ రమణారెడ్డి, కర్రె పద్మ, అనీల్, పరశురాములు, కాసం సంతోష్, గాడుగోని రమేష్, మల్లారెడ్డి, చందర్, తిరుమలరెడ్డి, ఉదయ్, నరేష్, బండ రాకేష్, విద్యాసాగర్‌తో పాటు ఢిల్లీ డిఫెన్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు అవసరం టీ.జె.ఏ



సిద్దిపేట, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతూ తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీ.జె.ఏ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌లకు వినతిపత్రం అందజేశారు. టీ.జె.ఏ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, అయితే పలువురు జర్నలిస్టులకు సొంత ఇళ్లు లేవని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వారి పిల్లలకు 100 శాతం విద్యా రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు .అత్యవసర వైద్య పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులతో ప్రత్యేక సేవలు కల్పించాలని, జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక పథకం అమలు చేయాలని కోరారు. అలాగే ఆర్టీసీ బస్ పాస్ రాయితీ రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా యంత్రాంగం, జర్నలిస్టు సంఘాలు, అధికారులు కలిసి సమన్వయ సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. కలెక్టర్ హైమావతి సానుకూలంగా స్పందిస్తూ జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీ.జె.ఏ జిల్లా అధ్యక్షుడు సొల్లేటి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎన్. రాజు, వంగ రాజు, సిహెచ్. గణేష్, భాష వేణి, లింగమూర్తి, సిహెచ్. మహేందర్, భాస్కర్ రెడ్డి, లింగాల బాబు, గుడి భాను, అంబడిపల్లి ఈశ్వర్, గౌస్ పాషా, ఇంతియాజ్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# యువతే న్యాయబద్ధ సమాజానికి దిక్సూచి ఏ. కిరణ్ కుమార్



కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా న్యాయవాది ఏ. కిరణ్ కుమార్ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన, రాజ్యాంగ విలువల పట్ల గౌరవం కలిగిన యువతే బలమైన ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు. యువతకు హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు, సమానత్వం, స్వేచ్ఛ, గౌరవంతో జీవించే హక్కుపై న్యాయవాదులు అవగాహన కల్పించారు.డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, వ్యక్తిగత సమాచార భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే పి.ఓ.సి.ఎస్.ఓ చట్టం--2012, బాల్య వివాహాల నిషేధ చట్టం--2006, జువెనైల్ జస్టిస్ చట్టం--2015, మాదకద్రవ్యాల చట్టం--1985 వంటి ముఖ్యమైన చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను లేదా హెల్ప్‌లైన్ ℓ15100ℓ సంప్రదించాలని సూచించారు. అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, పెరుక రంగయ్య, భాశెట్టి సమతా రాణి, పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ చైర్మన్ జంజిరాల వేణు, సిబ్బంది, యువతీ యువకులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సమస్యల పరిష్కరించాలని వినతి



హుస్నాబాద్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు.ఎస్.పి.సి) ఆధ్వ ర్యంలో డిటిఎఫ్ నాయకులు హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల కొరత, బదిలీలు, పదోన్నతులు, పెండింగ్ ఆర్థిక ప్రయోజనాలు వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రధాన డిమాండ్లలో పిఆర్సి నివేదిక అమలు, ఉపాధ్యాయులు--పెన్షనర్లకు బకాయిలుగా ఉన్న ఆరు విడతల డీఏ విడుదల, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, సిపిఎస్ రద్దు, ఉపాధ్యాయ పోస్టుల కేటాయింపు, బదిలీలు--పదోన్నతుల షెడ్యూల్ విడుదల, కొత్త జిల్లాలకు డీఈఓ, మండలాలకు ఎంఈఓ పోస్టుల మంజూరు ఉన్నాయి.కాంట్రాక్టు ఉద్యోగులు, మోడల్, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, హెల్త్ కార్డులు, ప్రమోషన్లు కల్పించాలని కూడా కోరారు.ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ దశలవారీగా ఉద్యమిస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించింది.ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ వి. వెంకటరమణారెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, సంపత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఈర్యా నాయక్, మల్లయ్య, చింతకింది శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఆర్.ఆర్. కళాశాలలో బాక్టీరియా వైవిధ్యంపై విస్తృత ఉపన్యాసం




కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో బి.ఎస్సీ విద్యార్థులకు "బాక్టీరియా వైవిధ్యం -- మానవ సంక్షేమంలో వాటి పాత్ర" అనే అంశంపై విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర సహాయ ఆచార్యురాలు డాక్టర్ ఏ. శైలజ ప్రధాన వక్తగా పాల్గొని, బాక్టీరియాల నిర్మాణం, వర్గీకరణ, జీవావరణ వ్యవస్థల్లో వాటి ప్రాధాన్యత, మానవ ఆరోగ్యం, వ్యవసాయం, ఔషధ తయారీ, పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్రను వివరించారు.జీర్ణక్రియ, రోగనిరోధక వ్యవస్థలో సూక్ష్మజీవుల ప్రాధాన్యత, జీవ ఎరువులుగా బాక్టీరియాల వినియోగం, కాలుష్య నివారణలో వాటి ఉపయోగం, పారిశ్రామిక ఉత్పత్తుల తయారీలో వాటి పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యాంటీబయాటిక్ మందుల దుర్వినియోగం వల్ల మందులకు లొంగని బాక్టీరియాలు పెరుగుతున్నాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమాన్ని వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొ. తిరుక్కోవేల శ్రీనివాస్ పర్యవేక్షించారు. విద్యార్థులు శాస్త్రీయ పరిశోధనలపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రౌతు రాధాకృష్ణ, డాక్టర్ థియర్ హుస్సేన్, డాక్టర్ పడాల తిరుపతి, శ్రీమతి కళాజ్యోతి, డాక్టర్ శ్యామల చంద, తాజుద్దీన్, స్వరూప రాణి తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైల్వే మౌలిక వసతుల బలోపేతంపై ఎంపీ ప్రత్యేక దృష్టి



పెద్దపల్లి , ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కాంగ్రెస్ ఎంపీలు గడ్డం వంశీకృష్ణ, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లు రవి, సురేష్ షెట్కర్ సమావేశ మయ్యారు.ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తన నియోజకవర్గానికి అత్యంత కీలకమైన రామగుండం--మణుగూరు రైల్వే మార్గం పురోగతిపై ప్రత్యేకంగా చర్చించారు. సుమారు నాలుగు వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు.మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ రైల్వే మార్గానికి సంబంధించిన పనులు ముందుకు సాగుతు న్నాయని వివరించారు. అదేవిధంగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే మంజూరైన వంతెనలు, పైవంతెనలు, రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని ఎంపీ వంశీకృష్ణ రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లి, వెంటనే పూర్తి చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని, రైల్వే మౌలిక వసతులను బలోపేతం చేయడమే లక్ష్యంగా నిరంతరం ఫాలోఅప్ చేస్తున్నామని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. రామగుండం--మణుగూరు రైల్వే మార్గం నుంచి వంతెనలు, పైవంతెనలు, రైల్వే స్టేషన్ అప్‌గ్రేడేషన్ల వరకు పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పనులు వేగంగా జరిగేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# కల్వకుర్తి అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి హామీ

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కీలక ప్రతిపాదనలు
- మౌలిక వసతులు, ఇందిరమ్మ ఇళ్లపై సీఎంతో ప్రత్యేక చర్చ



**ఆమనగల్లు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను సమర్పించారు. ఆమనగల్లు, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు కలిపి రూ.80 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి రూ.30 కోట్లు, కల్వకుర్తి మున్సిపాలిటీకి రూ.50 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నియోజకవర్గంలోని గ్రామాలు, గ్రామపంచాయతీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో పేద, లంబాడీ కుటుంబాలు అధికంగా ఉన్నందున అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి మరిన్ని నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రతిపాదనలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే సమర్పించిన ప్రతిపాదనలపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, అభివృద్ధి పనులకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# మహిళలకు హస్తకళలతో స్వయం ఉపాధి

- తాటి ఆకుల అల్లికల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- సర్పంచ్ మహేందర్ గౌడ్




**ఆమనగల్లు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా సరికొండ గ్రామ పంచాయతీలో తాటి ఆకుల అల్లికలు, హస్తకళల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర ప్రభుత్వ హస్తకళల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువర్చల తన బృందంతో హాజరై మహిళలకు శిక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సువర్చల మాట్లాడుతూ మహిళలు ఆసక్తితో శిక్షణ పొందితే తాటి ఆకులతో వివిధ రకాల హస్తకళా ఉత్పత్తులను తయారు చేసి స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. శిక్షణలో పాల్గొనే వారికి రోజుకు రూ.300 చొప్పున దినసరి కూలీ అందించడంతో పాటు 25 రోజుల శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం తరఫున సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణహిత ఉత్పత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా తెలంగాణ హ్యాండ్‌క్రాఫ్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. సర్పంచ్ మహేందర్ గౌడ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో సరికొండ గ్రామాన్ని ఈ శిక్షణకు ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. గ్రామంలోని తాటి వనాన్ని గుర్తించి మహిళలకు ఈ అవకాశాన్ని కల్పించడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. యువతులు, నిరుపేద మహిళలు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. తాటి ఆకులతో తయారు చేసే హస్తకళలకు ప్రోత్సాహం లభిస్తే గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, మహిళా సమైక్య సభ్యులు, గ్రామ యువతులు తదితరులు పాల్గొన్నారు

# ఇంటర్ విద్యార్థులకు ఉచిత నోటుబుక్స్

- ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి: ప్రిన్సిపాల్ మాధవరావు




**ఆమనగల్లు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆమనగల్లులో ఇంటర్మీడియట్ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అందించిన ఉచిత నోటుబుక్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు విద్యార్థి కిట్‌లో భాగంగా నోటుబుక్స్ అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు తెలిపారు. విద్యార్థులపై విద్యా సామగ్రి భారం తగ్గించడంతో పాటు చదువుపై మరింత దృష్టి సారించేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు కళాశాల స్థాయిలోనూ నిరంతరం ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత నోటుబుక్స్ వంటి సదుపాయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని అధ్యాపకులు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జైపాల్, పర్వతాలు, నాగమణి, కృష్ణయ్య, విష్ణు, రవి, అలివేలు, లైబ్రేరియన్ చైతన్య, అధ్యాపక బృందం సభ్యులు విజయ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# యువతలో దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించాలి

- వందేమాతరం 150 ఏళ్ల స్ఫూర్తితో ఆమనగల్లులో యువ సమ్మేళనం
- ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఘనంగా కార్యక్రమం



**ఆమనగల్లు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వందేమాతరం 150 సంవత్సరాల స్ఫూర్తి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆమనగల్లు ఖండ ఆధ్వర్యంలో బుధవారం యువ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యువత, విద్యార్థులు, స్వయంసేవకులు, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. వందేమాతరం ఉద్యమ స్ఫూర్తిని నేటి యువతకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశం పట్ల అంకితభావం, క్రమశిక్షణ, సేవాభావం, జాతీయ ఐక్యత వంటి విలువలను యువత అలవర్చుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ సమాజ అభివృద్ధిలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. యువతలో దేశభక్తి, జాతీయ భావనతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించడమే సమ్మేళనం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆలూరు రాజేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఖండ సంఘచాలక్ అంజయ్య, ఖండ కార్యవాహ సుక్క ఆనంద్‌తో పాటు తిరుపతి, శ్రీశైలం, వంశీ, గణేష్, ప్రభాకర్, విశ్వనాథం, శివ, సందీప్, మల్లేష్, భరత్, యాదిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ సారా, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

- ఎక్సైజ్ సీఐ బాధ్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు
- చరికొండలో 8 లీటర్ల సారా స్వాధీనం.. ఒకరి అరెస్ట్ వివిధ కేసుల్లో నిందితులకు బౌండోవర్




**ఆమనగల్లు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అక్రమ మద్యం, సారా, మత్తు పదార్థాల విక్రయాలపై ఆమనగల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తోంది. ఎక్సైజ్ సీఐ బాధ్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, ధాబాలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ మద్యం విక్రయాలు, నిషేధిత మత్తు పదార్థాల సరఫరాపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఐ బాధ్యనాథ్ చౌహాన్ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా మద్యం విక్రయించడం, తాగించడం, అక్రమ సారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కిరాణా దుకాణాల్లో అక్రమ సారా తయారీకి ఉపయోగించే బెల్లం, నల్లబెల్లం, పటిక తదితర పదార్థాలను అక్రమంగా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలో అక్రమంగా సారా సరఫరా చేస్తున్న వ్యక్తిని అధికారులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనంతో పాటు సుమారు 8 లీటర్ల అక్రమ సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. వివిధ కేసుల్లో పట్టుబడిన నిందితులను కడ్తాల్, మాడుగుల తహసీల్దార్ల ఎదుట బౌండోవర్ చేసినట్లు తెలిపారు. గంజాయి, మాదక ద్రవ్యాలు, ఇతర నిషేధిత మత్తు పదార్థాల అక్రమ విక్రయాలపై కూడా నిరంతరం నిఘా కొనసాగుతుందని సీఐ తెలిపారు. అక్రమ మద్యం, సారా లేదా మత్తు పదార్థాల విక్రయాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. తనిఖీల్లో ఎస్ఐ అరుణ్ కుమార్, ఎస్ఐ శివ ప్రసాద్, హెచ్‌సీ చెన్నయ్య, ఈసీలు రామ్‌రెడ్డి, శ్రీను, లత, సాయి శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వాయర్ అభివృద్ధికి రూ.43.50 కోట్లు మంజూరు



**గంగాధర, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నారాయణపూర్ రిజర్వాయర్ అభివృద్ధికి రూ.43.50 కోట్లు మంజూరు చేయించామని, త్వరలోనే కుడి కాలువ నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాది కాలంలో పూర్తి చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. గంగాధర మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ క్రింద ముంపునకు గురవుతున్న భూములు, ఇండ్ల సమస్యలు, కట్ట ఎత్తు పెంపు, బండ్ పటిష్టం, కాలువల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామని చెప్పారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శిస్తూ, పని చేతగాని నాయకులు అబద్దాలు వల్లే వేస్తున్నారని దుయ్యబట్టారు. నిర్వాసితులకు దశలవారీగా న్యాయం చేస్తామని, ప్రజలు ప్రతిపక్షాల మాటలను నమ్మి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాధర, బోయినపల్లి మండలాల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ముద్ర నగేష్, భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, సర్పంచులు వేముల భాస్కర్, బారాజు ప్రభాకర్ రెడ్డి, బాస వేణి శ్రీనివాస్, ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఏనుగుల కనకయ్య, రోమల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్



**హుస్నాబాద్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ నియోజకవర్గంలోని పొట్లపల్లి గ్రామంలో సి సి రోడ్డు పనులను సర్పంచ్ రాచపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామంలోని మూడో, ఆరో వార్డుల్లో రూ.10 లక్షల నిధులతో రోడ్ల పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర రవాణా శాఖ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సర్పంచ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నాంపల్లి శంకర్, చొప్పరి శ్రీనివాస్, చుక్క పుష్పలత, కార్యదర్శి వెంకటేశ్వరరావు, మహిళా సంఘం ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాళేశ్వరం జలాలతో కళకళలాడుతున్న బావు చెరువు



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కొత్తపల్లి మండలం బావుపేట శివారు బావు చెరువు కాళేశ్వరం జలాలతో నిండిపోవడంతో రైతులు ఆనందోత్సాహాల మధ్య వనభోజన వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై రైతన్నలతో కలిసి సందడి చేశారు. మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన అనంతరం రైతులతో సహపంక్తి భోజనాలు చేశారు. కేసీఆర్ హయాంలోనే నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని, వందల కోట్ల రూపాయల నిధులు తెచ్చి సాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శిస్తూ, త్వరలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాళేశ్వరం జలాలను జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మత్తులకు రూ.16 లక్షలు నిధులు మంజూరు



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్--కామారెడ్డి ప్రధాన రహదారిలో చెడిపోయిన బావుపేట రోడ్డు మరమ్మత్తుల కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తన ఎంపీ నిధుల నుండి రూ.16 లక్షలు కేటాయించారు. ఈ నిధుల కేటాయింపుపై కొత్తపల్లి బీజేపీ మండల శాఖ హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు కుంట తిరుపతి మాట్లాడుతూ రోడ్డు మరమ్మత్తులకు నిధులు ఇచ్చింది బండి సంజయ్ అని, కానీ బిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్రెడిట్ కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్ర జల ప్రయాణ ఇబ్బందులను తొలగించేందుకు తక్షణ స్పందించి నిధులు కేటాయించినందుకు బండి సంజయ్‌కు కొత్తపల్లి మండల ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్ హెచ్ రోడ్ టోల్ గేట్ పనులు పూర్తి చేయాలని బీఆర్ఎస్ డిమాండ్



**హుస్నాబాద్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ మండలం పందిళ్ల స్టేజి వద్ద ఎన్ హెచ్ రోడ్‌లో టోల్ గేట్ పనులు ఆరు నెలలుగా కొనసాగుతున్నా పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల రాకపోకల కోసం వేసిన మట్టి రోడ్ గుంతలు పడిపోవడంతో వర్షం వస్తే బురద, ఎండలో దుమ్ము ధూళి సమస్యలు పెరిగి వాహనదారులు నరకయాతన పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టోల్ గేట్ పనులను తక్షణమే పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని, లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున రెడ్డి, మేకల వికాస్ యాదవ్, యాస శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, మాటూరి రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
గురువారం, ఆగస్టు 13, 2026



## ఐదు రోజుల బాబుకు రక్తదానం చేసిన పోలీస్



**కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ పట్టణంలోని శ్రీ శేషి కాంత్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఐదు రోజుల బాబుకు అత్యవసరంగా ఓ పాజిటివ్ ఆర్‌డిపి అవసరమైన నేపథ్యంలో, బొమ్మకల్ 6వ డివిజన్‌కు చెందిన అబ్కారీ శాఖ కానిస్టేబుల్ గాలిపెల్లి రాజశేఖర్ వెంటనే స్పందించి రక్తదానం చేశారు. ఇది ఆయన తొమ్మిదోసారి రక్తదానం కావడం విశేషం. అత్యవసర సమయంలో బాబుకు ప్రాణదాతగా నిలిచిన రాజశేఖర్‌ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, పేషెంట్ కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు. ప్రతి యువకుడు 18 ఏళ్లు నిండిన తర్వాత మూడు నెలలకొకసారి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని రాజశేఖర్ పిలుపునిచ్చారు.

## గాయత్రి కళాశాలలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహణ



**పెద్దపల్లి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి జిల్లాలోని గాయత్రి డిగ్రీ & పీజీ కళాశాలలో గోష్టి ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడి విశ్వరూపిణి, హెచ్‌ఆర్ నఫిజా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, వర్క్ ఎన్విరాన్మెంట్, కెరీర్ ప్రాస్పెక్ట్స్ గురించి వివరించారు. విద్యార్థుల్లో నమ్మకం పెంచుతూ భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించారు. 60 మంది విద్యార్థులు పాల్గొని తమ రెస్యూమ్‌లు సమర్పించారు. ఈ అవకాశాన్ని కల్పించిన గోష్టి టీంను కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, లెక్చరర్లు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యారోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించిన ఆయన, అవసరాలకు అనుగుణంగా సిబ్బంది నియామకం, సర్దుబాటు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రత, పారిశుధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రోగులకు అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా పర్యవేక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి తక్షణ చికిత్స అందేలా చూడాలని ఆయన ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి పవిత్ర, డీసీహెచ్ఎస్ శ్రీధర్, రమాదేవి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## సరస్వతీ శిశు మందిర్‌లో అరటి మొక్కల నాటిన మేయర్



**కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగరంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ఆవరణలో నగర మేయర్ కొలాని శ్రీనివాస్ అరటి మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో సుమారు 200 అరటి మొక్కలను రంగు సంపత్ అందజేశారు. అనంతరం విద్యార్థులకు సువర్ణప్రాశన చుక్కలు వేసి ఆరోగ్య కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ఆరోగ్యవంతంగా, క్రమశిక్షణతో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల యాజమాన్యం నిర్వహిస్తున్న విద్యా, ఆరోగ్య, పర్యావరణ కార్యక్రమాలను మేయర్ అభినందించారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, బొడ్డ శ్రీనివాస్, గుగ్గిళ్లపు రమేష్, ఏబీవీ చంద్ర, మాసం గణేష్, దేవసాని సరస్వతీ సత్యనారాయణ, పాఠశాల ప్రధానాచార్యుడు మోర రణధీర్ మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన యు. శ్రీనివాస్



**గంగాధర, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** చొప్పదండి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యు. శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో వసతులు, అందిస్తున్న సేవలను పరిశీలించిన ఆయన, మహిళా డాక్టర్ లేకపోవడం వల్ల ప్రసూతి గర్భిణీ స్త్రీలకు చికిత్స అందకపోతున్నారని, రాత్రి పూట సేవలు పరిమితంగా ఉన్నాయని తెలిపారు. వంద పడకల హాస్పిటల్ నిర్మాణం పూర్తయినా ఇప్పటివరకు ప్రారంభించలేదని విమర్శించారు. ప్రైవేట్ వైద్యం ఖరీదైనందున ప్రభుత్వం వెంటనే వంద పడకల హాస్పిటల్‌ను ప్రారంభించి, తగిన సిబ్బందిని నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకుడు గంగిపల్లి కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా రంగనాథన్ జయంతి వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్‌లో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ పితామహుడు ప్రొ. యస్. ఆర్. రంగనాథన్ 134వ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. డి. వరలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ రంగనాథన్ గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి వర్గీకరణ, సూచీకరణ, సేవల రూపకల్పనలో విశేష కృషి చేశారని తెలిపారు. విద్యార్థినులు గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రంథపాలకుడు యం.డి. హఫీజ్ మియా రంగనాథన్ రచనలు, పంచ సూత్రాలు, కోలన్ క్లాసిఫికేషన్ విధానాన్ని వివరించారు. విద్యార్థినులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు స్వరూప, శ్రీనివాస్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి కూనంనేని సాంబశివరావు




**కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీజేపీ పాలన దేశాన్ని భ్రష్టు పట్టిస్తోందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. జమ్మికుంటలో జరిగిన ప్రచార ర్యాలీ, సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, నీట్ పేపర్ లీకేజీ, కార్మికుల హక్కులు, రైతుల కష్టాలు అన్నీ కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అదానీ, అంబానీలకు ప్రజల సంపదను దోచిపెడుతున్న పాలనను మార్చాలని పిలుపునిచ్చారు. మతం, కులం పేరుతో దేశంలో మతోన్మాదం సృష్టిస్తున్న మోదీ–అమిత్‌షా పాలనను ప్రజలు తిరస్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎర్ర జెండా పేదల పిలుపు దేశాన్ని కాపాడుతుందని, పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టు ఉద్యమమేనని పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మంచి చేస్తే మద్దతు ఇస్తామని, చెడు చేస్తే ప్రశ్నిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, కర్రె భిక్షపతి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ఫీడర్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేత

**కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఫీడర్ పనుల నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉజ్వల పార్క్ ఫీడర్, ఫిల్టర్ బెడ్ ఫీడర్లపై ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ప్రభావిత ప్రాంతాలు: శ్రద్ధాయని హోటల్ ఏరియా, ఎన్టీఆర్ స్టాచ్యూ ఏరియా, డి మార్ట్ ప్రాంతం, బైపాస్ ఏరియా, పాలిటెక్నిక్ కాలేజీ ఏరియా, జబీఐ కాలేజీ. అలాగే పీటీసీ ఫీడర్‌పై లైన్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ప్రభావిత ప్రాంతాలు: బుల్ స్టేషన్, పోలీస్ శిక్షణ కేంద్రం. విద్యుత్ సరఫరా అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఏడీఈ ఎం. లావణ్య కోరారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గో సేవ కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వాసవి క్లబ్ కాపుల్స్ కరీంనగర్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా గో సేవ కార్యక్రమం నిర్వహించారు. కోతి రాంపూర్ గిద్ద పెరుమాళ్ల స్వామి ఆలయంలో గోపూజ చేసి, గోవులకు దాణా అందజేశారు. గోశాలలో గోవులను సంరక్షిస్తున్న గో సేవకునికి ధన, వస్త్ర సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రాంతీయ జిల్లా జగదీష్, క్యాబినెట్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఎల్లంకి ప్రదీప్, ట్రెజరర్ వేణుగోపాల్, అధ్యక్షుడు సామా లక్ష్మణ్, సభ్యులు పోచమ్మల విజయ్, బండ అజయ్, విద్యాసాగర్, పైడరవి, రాజు తదితరులు పాల్గొన్నారు. వాసవి మాత సేవలో భాగంగా గో సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి గోలి శ్రీనివాస్ రెడ్డి భరోసా



**– ప్రమాదంలో గాయపడిన కెలావత్ శ్రీనుకు రూ.5 వేల ఆర్థిక సాయం**

**అమనగల్లు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేతావత్ శ్రీనును తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. కల్వకుర్తి నియోజకవర్గం జెపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నెమలి గుట్ట తండాకు చెందిన కెలావత్ శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న గోలి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఆసుపత్రికి వెళ్లి శ్రీను ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీనుకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు జోగయ్య, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, మాజీ సర్పంచ్ అంజి నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కొమ్ము నగేష్, సీనియర్ నాయకులు ప్రసాద్, వార్డు సభ్యులు గోపాల్ నాయక్, బీఆర్ఎస్వీ నాయకులు తరుణ్, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలో పాల్గొన్న మేయర్




**కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీజేపీ కరీంనగర్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో నగర మేయర్ కొలాని శ్రీనివాస్ పాల్గొన్నారు. నగరంలోని ప్రధాన వీధుల గుండా టవర్ సర్కిల్ వరకు సాగిన జాతీయ జెండా ర్యాలీలో విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశ సమైక్యత, జాతీయ గౌరవం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రజలు విస్తృతంగా విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు తనుకు సాయికృష్ణ, కార్పొరేటర్లు గుగ్గిళ్లపు రమేష్, వంగల పవన్, ఒంటెల సత్యనారాయణరెడ్డి, తాటి ప్రభావతి, గొట్టుముక్కల ఉమారాణి వెంకటరమణ, దేవసాని సరస్వతీ సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు బల్బీర్ సింగ్, కన్న కృష్ణ, వరాల జ్యోతి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## సీసీ డ్రైన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 26వ డివిజన్ ఆదర్శనగర్‌లో రూ.10 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైన్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం లక్ష్యమని పేర్కొన్నారు. పనులు పూర్తయిన తర్వాత కాలనీవాసులకు మెరుగైన పారిశుధ్య వాతావరణం కల్పించడంతో పాటు డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన అన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజల సహకారం అవసరమని, పనుల నాణ్యత విషయంలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు మేయర్ కొలాని శ్రీనివాస్




**కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపణలకు కరీంనగర్ మేయర్ కొలాని శ్రీనివాస్ ఘాటుగా స్పందించారు. గత మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరగలేదని చేసిన ఆరోపణలను ఖండించిన ఆయన, ఐదు నెలల్లో మూడు కౌన్సిల్ సమావేశాలు, బడ్జెట్ సమావేశం నిర్వహించి రికార్డుల్లో నమోదు చేశామని స్పష్టం చేశారు. మాజీ మేయర్‌గా పనిచేసిన వ్యక్తి రికార్డులు చూడకుండా వ్యాఖ్యలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని, భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. "సోయి" వ్యాఖ్యలపై స్పందిస్తూ --- జరిగిన సమావేశాలపై అవగాహన లేకుండా విమర్శించడం తగదని ఘాటుగా బదులిచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం అపోహలు సృష్టించడం మానుకుని, విలీన గ్రామాలు, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి సూచనలు చేస్తూ కలిసి రావాలని మేయర్ పిలుపునిచ్చారు.

## ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలి మాడిశెట్టి సంతోష్



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చామనపల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా మనకు స్వేచ్ఛ లభించిందని, వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని దేశం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. యువతలో దేశభక్తి భావాలను పెంపొందించేందుకు ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల బీజేపీ నాయకులు, ఉపసర్పంచులు దూడెం శ్రీనివాస్, గుండ్ల గోపాల్, శక్తికేంద్ర ఇంచార్జ్‌లు ఆవుల సునీల్, కూర అమరేందర్ రెడ్డి, వార్డ్ సభ్యులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం భద్రతపై కలెక్టర్ పరిశీలన




**సిద్దిపేట, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి కలెక్టరేట్ పక్కన ఉన్న ఈవీఎం గోదాంను ఆకస్మికంగా పరిశీలించారు. నెలవారీ తనిఖీ భాగంగా గోదాం చుట్టూ తిరిగి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాం నిర్వహణకు సంబంధించిన లాగ్‌బుక్‌ను తనిఖీ చేసి, సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈవీఎం గోదాం వద్ద పోలీసులు 24 గంటలూ పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని, పరిసర ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# ప్రభుత్వ భూములకు హద్దులు, ఫెన్సింగ్ తప్పనిసరి - కలెక్టర్ కె. హైమావతి



సిద్దిపేట, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తహసీల్దార్లను ఆదేశించారు. రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని 6 ఎకరాలు, మండల కేంద్రంలోని 5 ఎకరాల ప్రభుత్వ భూములను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి పరిశీలించిన ఆమె, అన్ని మండలాల్లో ప్రభుత్వ భూముల రికార్డులను తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని సూచించారు. భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అక్రమంగా కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, కార్యాలయాలు, పోలీస్ శాఖ, ఇతర భవనాల నిర్మాణాలకు అనువైన స్థలాలను గుర్తించి త్వరగా పనులు ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ కృష్ణమోహన్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 'మీల్స్ ఆన్ వీల్స్' 500వ రోజు సేవా కార్యక్రమం



కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మీల్స్ ఆన్ వీల్స్ -- ఆకలి నివారణ కార్యక్రమం" 500 వరుస రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి ఆలయం పక్కన నిరుపేదలకు ఉచితంగా పోషకాహార భోజనం, అరటిపండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ పాల్గొని స్వయంగా భోజనం వడ్డించారు. అతిథులు మాట్లాడుతూ, ఎటువంటి విరామం లేకుండా 500 రోజుల పాటు ఆకలి నివారణ కార్యక్రమం కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. నిర్వాహకులు ఈ ప్రయాణం 500 రోజుల సేవ, కరుణ, అంకితభావానికి ప్రతీక అని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన దాతలు, స్పాన్సర్లు, సభ్యులు, వాలంటీర్లు, శ్రేయోభిలాషులకు మీల్స్ ఆన్ వీల్స్ టీమ్ కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్తులో మరింత విస్తరించి ఎక్కువ మంది నిరుపేదలకు సేవలు అందించేందుకు కృషి చేస్తామని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

# గ్రామంలో బెల్ట్ షాపులకు నో.. గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం

సుల్తానాబాద్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :తోగర్రాయి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో బెల్ట్ షాపుల నిర్వహణను అడ్డుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సర్పంచ్ చిలుక స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి నోటిఫికేషన్ జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి బెల్ట్ షాపులు నిర్వహిస్తే పంచాయతీరాజ్ చట్టం--2018 ప్రకారం పోలీసుల సహకారంతో కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా నిబంధనలు పాటించాలని సూచించారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యు.ఎస్.పి.సి నిరసన



జమ్మికుంట, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు.ఎస్.పి.సి) ఆధ్వర్యంలో రెండవ దశ నిరసన కార్యక్రమం జరిగింది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు జమ్మికుంట తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. పి.ఆర్.సి కమిషన్ రిపోర్ట్ అమలు, పెండింగ్ డి.ఏ విడుదల, జీవో 25 సవరణతో ప్రాథమిక పాఠశాలలో తరగతికో ఉపాధ్యాయుని నియామకం చేయాలని డిమాండ్ చేశారు. టి.పి.టి.ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అవినాష్ సి.పి.ఎస్ రద్దు చేసి ఓ.పి.ఎస్ అమలు చేయాలని కోరారు. డీటీఎఫ్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్ వర్క్ అడ్జస్ట్మెంట్ పారదర్శకంగా జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కుమారస్వామి, కె. సంపత్, ఎం. సదానందం, ఎం. శ్రీనివాస్, పి. రాజు, పి. విజెందర్ రెడ్డి, హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో విద్యుత్, పారిశుద్ధ్యం, డ్రైనేజీపై ప్రత్యేక దృష్టి



సుల్తానాబాద్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఏడో వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కౌన్సిలర్ ఉట్ల వర ప్రదీప్ కోరారు. క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన, వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్, పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచనల మేరకు చేయూత పింఛన్లకు అర్హులైన వారు ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, అవివాహిత మహిళలు, దివ్యాంగులు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు వంటి వర్గాలకు నిర్దిష్ట అర్హతలతో పింఛన్లు లభిస్తాయని అధికారులు వివరించారు. అర్హులైన వారు సంబంధిత అధికారులను లేదా తనను సంప్రదించాలని కౌన్సిలర్ సూచించారు.

# తప్పిపోయిన వ్యక్తిని గుర్తించి కుటుంబానికి అప్పగించిన పోలీసులు



కరీంనగర్ రూరల్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌కు చెందిన గోచిపాకల శ్రీనుబాబు (26) కుటుంబ సమస్యల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయి, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మే 9న అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి ఆచూకీ కోసం ప్రయత్నించారు. ఆంధ్ర--రాయలసీమ ప్రాంతాల్లో అతని ఫొటోతో ప్రకటన విడుదల చేయగా, ఒక వ్యక్తి గుర్తించి సమాచారం అందించాడు. పోలీసులు అతనిని సంప్రదించి కరీంనగర్‌కు తీసుకువచ్చి విచారించారు. కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై వెళ్లిపోయానని, పిల్లలపై ప్రేమతో తిరిగి వచ్చానని శ్రీనుబాబు తెలిపాడు. తరువాత భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించి, పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని కలిసి జీవించాలని సూచించారు. అనంతరం వారిని కలిపి ఇంటికి పంపించారు.

# చేయూత ఫించన్‌తో అర్హులకు ఆర్థిక భరోసా

- డైరెక్టర్ వస్పుల శ్రీశైలం
- అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి
- వార్డు ఆఫీసర్‌కు ఫించన్ దరఖాస్తుల అందజేత



ఆమనగల్లు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేయూత ఫించన్ పథకం అర్హులైన పేదలకు ఆర్థిక భరోసాగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం అన్నారు. బుధవారం ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో 5వ వార్డుకు చెందిన దరఖాస్తుదారులతో కలిసి వార్డు ఆఫీసర్ వెంకటరామిరెడ్డికి ఫించన్ దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వస్పుల శ్రీశైలం మాట్లాడుతూ ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హిమోఫీలియా బాధితులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థికంగా వెనుక బడిన కుటుంబాలకు చేయూత అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన వారికి పింఛన్ మంజూరయ్యేలా అధికారులు దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని వస్పుల శ్రీశైలం కోరారు.

# మల్లేశంను కలిసి శుభాకాంక్షలు తెలిపిన మీసాల వంశీ



ఆమనగల్లు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్): వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ మల్లేశంను ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు మీసాల వంశీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యార్థుల సమస్యలు, మహిళా విద్యాభివృద్ధిపై చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యార్థుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని మీసాల వంశీ తెలిపారు. మహిళా విశ్వవిద్యాలయం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ మల్లేశంకు విద్యార్థి సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్ఓ) ప్రతినిధులు పాల్గొన్నారు.

# పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

- మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి
- అర్థం మనోహర్



ఆమనగల్లు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించాలనే సంకల్పంతో లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ ఆధ్వర్యంలో బుధవారం తలకొండపల్లిలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ హరిత చైర్మన్ లయన్ అర్థం మనోహర్, క్లబ్ సెక్రటరీ లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అర్థం మనోహర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించినప్పుడే కార్యక్రమం పూర్తి సార్థకత పొందుతుందని అన్నారు. గ్రామాలు, పాఠశాలలు, రహదారుల వెంట విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకుంటే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్ మోహన్ రెడ్డి, పీఆర్ఓ లయన్ పాషా, ఉపాధ్యాయులు సరిత, దీప్తి, అఖిల తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ చేపడుతున్న కార్యక్రమాలను పలువురు అభినందించారు.

# ప్లాస్టిక్‌పై విద్యార్థుల వ్యాస రచన



- విజేతలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు

ఆమనగల్లు, ఆగస్టు 12(నీలగిరి ఎక్స్ ప్రెస్): లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్లాస్టిక్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా తలకొండపల్లి జూనియర్ కళాశాలలో బుధవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం వంటి అంశాలపై విద్యార్థులు ఉత్సాహంగా వ్యాసాలు రాశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ సెక్రటరీ లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిని పి. వినయ్ కుమార్, ద్వితీయ బహుమతిని నరేష్, తృతీయ బహుమతులను నిఖిత, కావేరి సాధించారు. విజేతలను లయన్స్ క్లబ్ ప్రతి నిధులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని అన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలను వినియోగిస్తూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీచరణ్, అధ్యాపకులు విజయ్ కుమార్, ప్రణీష, ప్రమీల, పద్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడు ఆసుపత్రిలో అల్పాహారం పంపిణీ



ఎలిగేడు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎలిగేడు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రోగులకు ఉచితంగా అల్పాహారం పంపిణీ జరిగింది. లాలపల్లి గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, బిజెపి సీనియర్ నాయకుడు అమరగొండ గంగయ్య తన మనుమడు దేవాన్ష్‌తో కలిసి ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ నిస్సి క్రిస్టిన మాట్లాడుతూ, "ఈ అల్పాహారం తీసుకోవడం వల్ల షుగర్ కంట్రోల్లో ఉంటుంది" అని తెలిపారు. గంగయ్య తన ఔదార్యాన్ని చాటుకున్నారని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని అభినందించారు. ఆసుపత్రి వైద్య సిబ్బంది, వైద్యంకోసం వచ్చిన రోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శాతవాహన యూనివర్సిటీలో ఘనంగా ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరణ



కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఏఐఎస్ఎఫ్ 91వ వార్షికోత్సవం సందర్భంగా శాతవాహన యూనివర్సిటీలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఏఐఎస్ఎఫ్ కన్వీనర్ జంగాపెల్లి వరుణ్ శివాజీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ, గత 90 ఏళ్లుగా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, ఉద్యమాలకు ఏఐఎస్ఎఫ్ రక్షణ కవచంలా నిలుస్తోందని తెలిపారు. త్వరలో యూనివర్సిటీ సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ నాయక్, విద్యార్థి నాయకులు కేశవ్, లోలపు ప్రవీణ్, శంకర్, ప్రవీణ్, సాయి కిరణ్, శ్రీకాంత్, గిరి బాబు, ప్రణీత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అద్దె ప్రాతిపదికన వాహనం సమకూర్చేందుకు దరఖాస్తుల ఆహ్వానం

హుజురాబాద్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకాధికారి (ఐసీడీఎస్) హుజురాబాద్ ప్రాజెక్టు కార్యాలయానికి అద్దె ప్రాధిపదికన వాహనం సమకూర్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ సుగుణ తెలిపారు. దరఖాస్తులతో పాటు వాహనం, డ్రైవర్‌కు సంబంధించిన అన్ని పత్రాలను జత చేసి సీల్డ్ కవర్‌లో ఈ నెల 15 సాయంత్రం 5 గంటలలోపు హుజురాబాద్ కేసీ క్యాంపులో గల సిడిపిఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

# ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



మానకొండూర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అన్నారంలో చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు దూడం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్, నేత్ర వైద్యులు, చర్మ నిపుణులు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించిన చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ యాజమాన్యం, వైద్యులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొట్ల స్వరూప కిషన్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు భూమిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జీఆర్ఎంబీ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులను తొలగించాలి బోయినపల్లి వినోద్‌కుమార్



కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జీఆర్ఎంబీ 18వ సమావేశ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులను వెంటనే తొలగించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో గంగుల నివాసంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనే నీళ్ల కోసం జరిగిన పోరాటమని, కేసీఆర్ హయాంలో అన్ని చట్టబద్ధ అనుమతులతోనే ప్రాజెక్టులు నిర్మించబడ్డాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కేంద్రానికి పంపిన ప్రతిపాదనలో తెలంగాణలోని 7 ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని కోరడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భాజపా, కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఈ అంశంపై ఎందుకు నిలదీయలేదని ప్రశ్నిస్తూ, వెంటనే ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి జీఆర్ఎంబీ ఎజెండా నుంచి ప్రాజెక్టులను తొలగించేందుకు గట్టిగా పోరాడాలని సూచించారు. ఒకవేళ అనుమతులు రద్దు చేస్తే రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు. ఈనెల 18లోగా ఎజెండా నుంచి ప్రాజెక్టులను తొలగించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, బారసా నాయకులు పాల్గొన్నారు.

# మహిళలతోనే సమాజంలో మార్పు సాధ్యం గుంజపడుగు హరిప్రసాద్



కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. జిల్లా నాయకురాలు కొరిమి పద్మ ఆధ్వర్యంలో మహిళలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ మహిళలు రాజకీయ, సామాజిక రంగాల్లో చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉం దని, వారి భాగస్వామ్యంతోనే సమాజంలో సమగ్ర మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు .ప్రజల హక్కులు, మహిళల భద్రత, సామాజిక న్యాయం, బలహీన వర్గాల సంక్షేమం కోసం పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కవితమ్మ నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన ప్రజల పక్షాన నిలుస్తుందని తెలిపారు. పార్టీలో చేరిన మహిళలకు తగిన బాధ్యతలు అప్పగించి ప్రజా సమస్యల పోరాటాల్లో భాగస్వాములను చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి, జిల్లా నాయకులు రంగరవేణి లక్ష్మణ్, బాసవేణి రాజేందర్, జంపాల రీతిష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యకు చర్యలు తీసుకుంటున్నాం కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జైపూర్ మండలంలోని గురుకుల బాలుర విద్యాలయం, చెన్నూర్ కస్తూరిబా బాలికల విద్యాలయం, గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన తరగతి గదులు, వసతి, వంటశాల, మూత్రశాలలు, మరమ్మత్తు పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు వినియోగించాలని అధికారులను ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించి, విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ టవర్ సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గంజ్ గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులు పాల్గొని దేశభక్తిని ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో వాసవి వనిత ఏంజెల్స్ క్లబ్ అధ్యక్షురాలు రావికంటి భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల విద్య, పి.ఆర్.ఓ పబ్బ జ్యోతి, ఈసి సభ్యురాలు నగునూరి సంధ్యతో పాటు మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :-** 2025--26 వానకాలం, రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా రైస్ మిల్లర్లను ఆదేశించారు.కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగరావు, జిల్లా మేనేజర్ రజనీకాంత్‌తో పాటు రైస్ మిల్లర్ల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.రబీ సీజన్‌కు కేటాయించిన ధాన్యం, ఇప్పటివరకు పూర్తయిన సీఎంఆర్ డెలివరీ, మిగిలిన పరిమాణంపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్, గడువులోగా డెలివరీ పూర్తి చేసి ఎఫ్‌సీఐ గోదాముల్లో భద్రపరచాలని సూచించారు.రైల్వే వ్యాగన్లు అందుబాటులోకి వచ్చిన వెంటనే బియ్యం తరలింపులో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గోదాముల్లో భద్రపరిచే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పత్తి రైతుకు తాళ్ల రవీందర్ భరోసా

**- పంట నష్టాన్ని పరిశీలించి.. బాధిత రైతుకు అండగా ఏఎంసీ డైరెక్టర్**



**ఆమనగల్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పత్తి పంట నష్టపోయిన రైతుకు ఏఎంసీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ అండగా నిలిచారు. ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామానికి చెందిన రైతు వసంత రవి పంటను బుధవారం ఆయన పరామర్శించి నష్టానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రైతు తన సొంత 2 ఎకరాలతో పాటు మరో 3 ఎకరాల కౌలు భూమిలో మొత్తం 5 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పక్క పొలంలో జొన్న పంటకు డ్రోన్ ద్వారా కలుపు మందు పిచికారీ చేయగా, గాలికి మందు పత్తి పొలంలోకి చేరడంతో సుమారు 4 ఎకరాల పత్తి పంట దెబ్బతిని దాదాపు రూ.4 లక్షల నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా తాళ్ల రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన కలుపు మందులను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత మందులు విక్రయించే ఎరువుల దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, పంట నష్టానికి కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతుల పంటలకు నష్టం కలగకుండా మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని తాళ్ల రవీందర్ కోరారు.

## బోడుప్పల్‌లో కొత్త పింఛన్ల దరఖాస్తులకు ఆహ్వానం



**బోడుప్పల్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్ల అమలు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బోడుప్పల్ సర్కిల్--10 డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా వంటి కేటగిరీలకు చెందిన అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పింఛన్ ఫారమ్‌లు బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయి. అదనంగా, మీ సేవ ఇంటర్నెట్ ద్వారా కూడా ఫారమ్‌లు పొందవచ్చని తెలిపారు. పింఛన్ దరఖాస్తుల చివరి తేదీ ఆగస్టు 30గా నిర్ణయించబడిందని డిప్యూటీ కమిషనర్ శైలజ స్పష్టం చేశారు.

## దివ్యంగునికి కూత్రిమ కాలు అందజేత



**కూకట్‌పల్లి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**గజ్వేల్ పట్టణానికి చెందిన సాయిలు అనే దివ్యాంగుడు కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలును కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. రోజువారీ పనులు చేయడమే కష్టసాధ్యమైపోయిన ఈ పరిస్థితిని గమనించిన తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ చొరవతో, భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునరావాస కేంద్రం ట్రస్ట్ ద్వారా సాయిలుకు అవసరమైన కూత్రిమ కాలు అమర్చారు.ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ, "నా జీవితం పూర్తిగా అంధకారంలోకి వెళ్లిపోయిందని అనుకున్న సమయంలో కొత్త ఆశలు చిగురింపజేసిన భారత్ వికాస్ పరిషత్ పునరావాస కేంద్రం, మేనేజర్ నరేంద్ర గారికి, మేరుగు శివకృష్ణ అన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు" అని భావోద్వేగంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యూశక్తి దివ్యాంగుల అధ్యక్షుడు వేల్పుగొండ వెంకటస్వామి, శాంతి వికలాంగుల సభ్యురాలు గంటి భ్రమరాంబికా, మీడియా ప్రతినిధులు రఘు, మధు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు కీలక రహదారి ప్రాజెక్టులు మంజూరు చేయాలి

**- ఎంపీ మల్లు రవి**



**ఆమనగల్లు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ అభివృద్ధికి కీలకమైన రహదారి ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదాలు, నిధులు మంజూరు చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్ డాక్టర్ మల్లు రవి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. బుధవారం పార్లమెంట్ భవనంలో కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన రహదారి ప్రాజెక్టులపై వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్ ప్రాంతీయ రింగ్ రోడ్ ఉత్తర భాగం (ఎన్‌హెచ్-161ఏఏ)కు కేబినెట్ ఆమోదం, దక్షిణ భాగం అలైన్‌మెంట్‌కు అనుమతి ఇచ్చి భూసేకరణను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణను బందర్ పోర్టుతో అనుసంధానించే హైదరాబాద్--అమరావతి--బందర్ పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు మంజూరు ఇవ్వాలని కోరారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తూ మన్ననూర్--శ్రీశైలం మధ్య ఎన్‌హెచ్-765పై నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్‌కు తక్షణ అనుమతి ఇవ్వాలని ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర రహదారి అనుసంధానం, రవాణా, లాజిస్టిక్స్ రంగాలను బలోపేతం చేసి తెలంగాణ ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని మల్లు రవి పేర్కొన్నారు.

## శ్రావణ శోభకు వేళాయె..

**ఆలయాల్లో ప్రారంభం కానున్న ప్రత్యేక పూజలు**





**ఎలిగేడు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పవిత్రమైన శ్రావణ మాసం నేటి నుంచి ప్రారంభం కానుంది. దీంతో మండలంలోని ఆలయాలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయి. శ్రావణ మాసం సందర్భంగా నెల రోజులపాటు వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.శ్రావణ మాసం పవిత్రమైనదిగా భావించే భక్తులు ఈ మాసంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తారు. మహిళలు, పురుషులు నిష్టతో ఉపవాస దీక్షలు చేపట్టి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా మహిళలు వరలక్ష్మీ వ్రతం, మంగళగౌరి వ్రతం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో ఆచరిం చనున్నారు. శ్రావణ మాసంలో నాగుల పంచమి, వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి ముఖ్యమైన పర్వదినాలు రావడంతో భక్తుల్లో పండుగ వాతావరణం నెలకొననుంది. ఆయా పర్వదినాల్లో ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు, సామూహిక పూజలు, అభిషేకాలు, భజనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఇక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని వివాహాలు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాలకు అనుకూ లమైన ముహూర్తాల కోసం ప్రజలు పురోహితులను సంప్రదిస్తున్నారు. దీంతో శుభకార్యాల సందడి కూడా పెరగనుంది. శ్రావణ మాసం ప్రారంభంతో గ్రామాల్లో భక్తి భావం వెల్లివిరియడంతో పాటు ఆలయాలు భక్తుల రాకతో కళకళలాడనున్నాయి.

## దేశ రక్షణలో యువత అప్రమత్తంగా ఉండాలి



**అచ్చంపేట, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ శతజయంతి సందర్భంగా అచ్చంపేట నగరంలోని లోటస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తగా హాజరైన దేవేంద్ర రాజు, ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ ప్రచారక్, స్వాతంత్ర పోరాటంలో యువకులు దేశం కోసం చేసిన త్యాగాలను క్లుప్తంగా వివరించారు. అదే స్ఫూర్తితో నేటి యువత దేశ రక్షణ కోసం అప్రమత్తంగా ఉండి, సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ మహేష్ మాట్లాడుతూ, యువకులు కెరీర్ సంపాదించుకోవడంతో పాటు దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా సంఘచాలక్ నారా యణ, కట్ట ప్రభాకర్ రెడ్డి, బృంగి భాస్కర్, పురం వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ ముక్తాల శంతన్ తదితర సంఘ పెద్దలు హాజర య్యారు.యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దేవరకొండ నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడిగా కామేపల్లి సైదులు



**దేవరకొండ, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ, ఆకాష్ ఆనంద్ నాయకత్వాన్ని స్వాగతిస్తూ తెలంగాణ రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ సారథ్యంలో దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా కామేపల్లి సైదులు నియమితులయ్యారు.ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ, "నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, నీలి జెండాను దేవరకొండ గడ్డపై ఎగరేస్తాను" అని హామీ ఇచ్చారు. పార్టీని ప్రతి మండలంలో గ్రామస్థాయి వరకు విస్తరింపజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.విద్యార్థులు, యువతతో అనుసంధానం పెంచుతూ, బహుజన సమాజ్ పార్టీ సిద్ధాంతాలు, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం గురించి విస్తృతంగా అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

"బహుజనుల హక్కుల కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రజల మధ్య నిరం తరం ఉంటూ పనిచేస్తాను" అని అన్నారు. నియోజకవర్గ అధ్యక్ష పదవిని ఒక పదవిగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించి, నిజాయితీ, నిబద్ధతతో ముందుకు సాగుతానని కామేపల్లి సైదులు పేర్కొన్నారు.

## దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్



**డిండి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డిండి మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు కళ్ళెం సిద్దు శ్వేత--అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ, "ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం. స్వాతంత్ర్యం రాకముందే 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో బెనారస్ యూనివర్సిటీలో ఇది ఆవిర్భవించింది. కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏదైనా ఉంటే అది ఒక్క ఏఐఎస్ఎఫ్ మాత్రమే" అని అన్నారు.విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ప్రభుత్వ పాఠశాలలు--కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, మెస్--కాస్మోటిక్ చార్జీలను ధరలకు అనుగుణంగా పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ--అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, గురుకుల విద్యార్థులకు సొంత భవనాలు కేటాయించాలని డిమాండ్ చేస్తోందని ఆయన వివరించారు."విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులకు విద్యార్థి లోకం స్పందించి విజయవంతం చేయాలి. విద్యార్థులకు అండగా ఎల్లప్పుడూ ఏఐఎస్ఎఫ్ జెండా ఉంటూనే ఉంటుంది" అని కళ్ళెం సిద్దు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మధు, శ్యాంసోన్, సంజయ్, లోకేష్, రాజు, చందన, హారిక, అఖిల, శిరీష, కిరణ్, నాని, చరణ్, జావిద్, డేవిడ్, సందీప్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## మర్రిగూడలో ఎస్ఐఆర్ ప్రక్రియ 93.4 శాతం పూర్తి



**మర్రిగూడ, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**మర్రిగూడ మండలంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియ 93.4 శాతం పూర్తయిందని మండల తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. మొత్తం 30,503 మంది ఓటర్లకు గాను ఇప్పటివరకు 28,489 మంది ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తయ్యాయని ఆయన వివరించారు. ఈ ప్రక్రియలో 143 మంది మృతులు, 1,712 మంది ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, 125 మంది డబుల్ ఓటర్లు, 34 మంది అందుబాటులో లేని వారుగా గుర్తించారని తెలిపారు.తహసిల్దార్ మాట్లాడుతూ, "ప్రతి అర్హ ఓటరు పేరు తప్పకుండా జాబితాలో ఉండేలా అధికారులు కృషి చేస్తున్నారు. ప్రజలు సహకరించి, సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలి" అని సూచించారు.

## రైతు సమస్యలను గుర్తించి చర్యలు చేపట్టాలి



**మర్రిగూడ, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**నాంపల్లి నుండి హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యంలో మర్రిగూడ మండల కేంద్రంలో పలువురు నాయకులను కలిసిన శాసన మండలి సభ్యుడు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, "యాగాలు, పూజలు చేసి రైతు సమస్యలు పరిష్కారం కావు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలి" అని అన్నారు.రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, కింటాకు ప్రభుత్వ పరంగా బోనస్ ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆయన సూచించారు. రైతులకు సరిపడా యూరియా, అడుగు మందులు అందించాలని, ఈ సంవత్సరం వర్షాలు అనుకూలంగా లేక పత్తి పంట వాడిపోతున్నందున పండించిన పంటకు సరైన ధర కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు."ప్రభుత్వాలు రైతుల పక్షాన నిలబడి, వారి సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలి" అని నెల్లికంటి సత్యం అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఎరుకల నిరంజన్, ఆకుల రఘుమయ్య, ఇరటి సత్తయ్య, రావుల రాములు, మహేందర్, పాపయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా మెహందీ ఉత్సవం



**కల్వకుర్తి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మెహందీ ఉత్సవాలు ఘనంగా నిర్వహిం చారు.కళాశాల ప్రిన్సిపాల్ శర్వాణి ఆధ్వర్యంలో లేడీ ఫ్యాకల్టీ సభ్యులు భాయి, సరళతో పాటు విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను విద్యార్థినులకు పరిచయం చేయడంతో పాటు వారిలో సృజనాత్మకత, ఉత్సాహం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.విద్యార్థినులు మెహందీ వేసుకుంటూ ఆనందంగా పాల్గొనగా, కళాశాల వాతావరణం పండుగలా మారింది.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



**కల్వకుర్తి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఊర్కొండ మండలం నర్సంపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన చింతల శంకర్ రెడ్డి, కొండ సలేశ్వరం, వీరెడ్డి ప్రమిల్లమ్మ కుటుంబాలను బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పరామర్శించారు.ఆయన కుటుంబ సభ్యులకు నివాళులు అర్పించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. "కుటుంబ సభ్యుల దుఃఖంలో నేను మీతో ఉన్నాను. ఇలాంటి కష్టకాలంలో మనం అందరం ఒకరికి ఒకరు అండగా నిలవాలి" అని జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన వెంట బీజేపీ నాయకులు ఉపసర్పంచ్ రేపని శ్రీనివాస్, రామాంజనేయులు, సందీప్ ఆంజనేయులు, హనుమంతు, శివకుమార్, శ్రీశైలం, ప్రవీణ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాంరెడ్డి, అఖిల్ తదితరులు ఉన్నారు.

# డిండి మండల సమగ్ర అభివృద్ధే లక్ష్యం ఎమ్మెల్యే బాలు నాయక్



డిండి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):డిండి మండలంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచించారు. డిండి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు.రెవెన్యూ శాఖ అధికారులు అర్హత ఉన్న రైతులకు భూ పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కొత్తగా పట్టాలు పొందిన రైతులు రైతు భరోసా, రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. "భూమి ఉన్న ప్రతి అర్హ రైతుకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో జలసిరి పనులు, గొర్రెలు--బర్ల షెడ్లు, పండ్ల తోటలు వంటి పనులను చేపట్టాలని సూచించారు. డిండి ప్రాజెక్టు నుంచి విడుదలైన నీటిని రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని, పంటల అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి నిరంతర తాగునీరు అందేలా పైపులైన్లు, మోటార్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ బాధితులు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులు వంటి వర్గాలకు పెన్షన్లు అందేలా అధికారులు అర్హులను గుర్తించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షిస్తూ, పెండింగ్‌లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని, గుడిసెలలో నివసిస్తున్న కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పశు సంవర్ధక శాఖ ద్వారా రైతులకు పశువైద్య సేవలు, టీకాలు, పశుపోషణపై అవగాహన కల్పించాలని సూచించారు. నల్లగొండ--డిండి డబుల్ రోడ్డు పనులను మొదటి విడతలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, రహదారి పూర్తయితే రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు. "డిండి మండల అభివృద్ధే మా లక్ష్యం. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదు" అని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఎల్పీవో, ఎంపీడీవో, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డు రక్షణకై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి సిఐటియు




నల్లగొండ, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును రద్దు చేయాలని కేంద్రం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండ పట్టణంలో జరిగిన పాలిష్, మార్బుల్ అండ్ గ్రానైట్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ -- వలస కార్మికులు లేబర్ కార్డులు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే లేబర్ వెల్ఫేర్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ద్వారా అందిస్తున్న పథకాలు అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నందున, నల్లగొండ జిల్లాలో సుమారు 4,000 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, పెళ్లి కానుకలు, ప్రసూతి బెనిఫిట్స్, సాధారణ మరణ పరిహారం వంటి పథకాలు కూడా ఆలస్యమవుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు బాధ్యతలు అప్పగించడం వల్ల కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, సంక్షేమ పథకాలు నేరుగా బోర్డు ద్వారానే అందించాలని డిమాండ్ చేశారు.సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ, "55 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు ?6000 పెన్షన్ ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు.జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ మాట్లాడుతూ, కార్మికులు ఐక్యంగా ఉండి, స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయాలని, యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ సమావేశంలో ఏడుగురు సభ్యులతో కొత్త కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సీనియర్ నాయకులు కందుల విజయ్ కుమార్, బకరం మహేందర్, తీగల అంజయ్య, తీగల నరసింహ, కంచనపల్లి కృష్ణయ్య, అదిరామ్ వెంకన్న, అంజి మహేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు న్యాయం చేయాలి
## కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం వినతి



నల్లగొండ, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు రావాల్సిన పెండింగ్ నష్టపరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని, కులాంతర వివాహం చేసుకున్న అర్హులైన దంపతులకు ప్రభుత్వం ప్రకటించిన ?2.50 లక్షల ప్రోత్సాహక పారితోషకాన్ని తక్షణమే మంజూరు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నల్లగొండ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.ఈ మేరకు సంఘం నాయకులు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యుడు జిల్లా శంకర్లను కలిసి వినతి పత్రం సమర్పించారు. నల్లగొండ జిల్లాలో 102 అట్రాసిటీ కేసులకు సంబంధించి 130 మంది బాధితులకు నష్టపరిహారం పెండింగ్‌లో ఉందని, నిధులు విడుదల కాకపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు తెలిపారు. ముఖ్యంగా హత్యలకు గురైన కుటుంబాలు ఆర్థిక, సామాజిక సంక్షోభంలో ఉన్నప్పటికీ వారికి చట్టప్రకారం అందాల్సిన పరిహారం సకాలంలో అందకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.అలాగే కుల వివక్షను అధిగమించి కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రకటించిన ?2.50 లక్షల ప్రోత్సాహక నగదు ఇప్పటికీ సుమారు 250 మంది దంపతులకు అందలేదని తెలిపారు. అర్హులైన ప్రతి దంపతికి ఎలాంటి జాప్యం లేకుండా ప్రోత్సాహక నగదు విడుదల చేయాలని వారు కోరారు.సంఘం నాయకులు మాట్లాడుతూ, "అట్రాసిటీ బాధితులకు చట్టం కల్పించిన రక్షణ, పరిహారం, పునరావాసం కాగితాలకే పరిమితం కాకుండా సకాలంలో అందినప్పుడే ప్రభుత్వంపై బాధితులకు నమ్మకం ఏర్పడుతుంది. కులాంతర వివాహాలను ప్రోత్సహించడం ద్వారా కుల వివక్ష నిర్మూలనకు మరింత బలం చేకూరుతుంది" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, సహాయ కార్యదర్శి గాదె నరసింహ, ఉపాధ్యక్షులు వంటిపాక కృష్ణ, తక్కెళ్లపల్లి శ్యామ్, బొంగరాల వెంకన్న, మాతంగి రవికుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# బిజినపల్లి కేజీబీవీపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



బిజినపల్లి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బుధవారం బిజినపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.కలెక్టర్ తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల విధి నిర్వహణను గమనించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. హాజరు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. తరువాత వంటగదిని పరిశీలించిన కలెక్టర్, భోజనం తయారీ ప్రదేశంలో పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. "ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం అందించాలి. నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదు" అని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు.పాఠశాల ఆవరణ, వంటగది, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, లోపాలను వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి, భోజన సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న అంశంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల అవసరాలను తెలుసుకుని సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.ఈ తనిఖీలో బిజినపల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో కథలయ్య, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మీ పిల్లల స్కూల్ బ్యాగ్ బరువు ఎక్కువగా ఉంటే.. ఈ సూచనలు కనిపిస్తాయి..



స్కూల్‌కు వెళ్లే పిల్లల బ్యాగ్‌లో పుస్తకాలు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, వాటర్ బాటిళ్లు, లంచ్ బాక్సులు, స్పోర్ట్స్ సామగ్రి వంటి అనేక వస్తువులు చేరుతుంటాయి. ఒక్కో వస్తువు తేలికగానే అనిపించినా, అన్నీ కలిపి బ్యాగ్ బరువు పెరిగితే పిల్లల మెడ, భుజాలు, వెన్నుపై అనవసరమైన ఒత్తిడి పడే అవకాశం ఉంటుంది. పిల్లలు నొప్పి గురించి చెప్పే వరకు వేచి చూడకుండా, బ్యాగ్ బరువు ఎక్కువగా ఉందో లేదో తల్లిదండ్రులు ముందుగానే గమనించడం మంచిది. బ్యాగ్ బరువు ఎక్కువగా ఉన్నప్పుడు పిల్లలు దానిని మోయడానికి ముందుకు వంగడం లేదా నడవడంలో ఇబ్బంది పడటం కనిపిస్తుంది. బ్యాగ్ పట్టీలు భుజాలపై గట్టిగా నొక్కడం, చర్మంలోకి దిగినట్లు కనిపించడం కూడా బరువు ఎక్కువగా ఉందనే సంకేతం అవుతుంది. అయితే పిల్లలు అసౌకర్యం లేదా నొప్పి గురించి చెప్పకపోయినా బ్యాగ్‌ను తేలికగా ఉంచడం అవసరం. భారీ బ్యాగ్ వల్ల తీవ్రమైన వెన్ను గాయాలు సాధారణంగా కనిపించకపోయినా, పిల్లలు బ్యాగ్‌తో నడుస్తూ జారిపడి లేదా పడిపోయినప్పుడు గాయం తీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లల వీపుపై అదనపు బరువు ఉన్నప్పుడు పడిపోవడం మరింత ప్రమాదకరంగా మారుతుంది.15 శాతానికి మించకూడదు..పిల్లల బ్యాగ్ బరువు వారి శరీర బరువులో 10 నుంచి 15 శాతానికి మించకూడదనే సూచన తరచూ వినిపిస్తుంది. అయితే పిల్లలందరికీ ఒకే పరిమితిని వర్తింపజేయడానికి తగిన ఆధారాలు లేవని నిపుణులు చెబుతున్నారు. పిల్లల శరీర పరిమాణం, శారీరక బలం, అభివృద్ధి స్థాయి, రోజువారీ కార్యకలాపాలు ఒక్కొక్కరికి భిన్నంగా ఉంటాయి. అందువల్ల సాధ్యమైనంత వరకు బ్యాగ్‌ను తేలికగా ఉంచడం, పిల్లల వ్యక్తిగత అవసరాలను పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యం. స్కూల్ నుంచి పుస్తకాలు, ఇతర సామగ్రి తీసుకురావాలనే జాబితా వచ్చినప్పుడు, పిల్లలు ప్రతిరోజూ నిజంగా ఏ వస్తువులు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందో తల్లిదండ్రులు ఒకసారి పరిశీలించాలి. అవసరం లేని వస్తువులను బ్యాగ్‌లో ఉంచకుండా చూడాలి. ట్రెండీగా కనిపించే లేదా అలంకరణ కోసం మాత్రమే ఉపయోగించే వస్తువుల కంటే, తరగతిలో పిల్లలకు నిజంగా అవసరమైన ప్రాథమిక సామగ్రికే ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుతం పాఠశాలల్లో టెక్నాలజీ వినియోగం పెరగడంతో ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు కూడా పిల్లల బ్యాగ్‌లలో భాగమవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పుస్తకాలతోపాటు ల్యాప్‌టాప్, దాని ఛార్జర్‌ను కూడా ప్రతిరోజూ మోయాల్సి వస్తోంది. ఇంట్లో ఉపయోగించాల్సిన అవసరం లేని రోజుల్లో ల్యాప్‌టాప్‌ను పిల్లలు ఇంటికి తీసుకురాకుండా చూడటం ద్వారా బ్యాగ్ బరువును తగ్గించవచ్చు.తరచూ పరిశీలించాలి..పిల్లలు పెద్దయ్యే కొద్దీ స్కూల్ బ్యాగ్‌లో అవసరం లేని వ్యక్తిగత వస్తువులు కూడా చేరే అవకాశం ఉంటుంది. మేకప్ సామగ్రి, నెయిల్ పాలిష్, హెయిర్ డ్రైయర్ వంటి వస్తువులను పిల్లలు బ్యాగ్‌లో ఉంచడం వల్ల అదనపు బరువు చేరుతుంది. అందుకే బ్యాగ్‌లోని వస్తువులను తరచూ పరిశీలించి, అవసరం లేనివాటిని తొలగించడం మంచిది. పిల్లలకు సరైన బ్యాగ్‌ను ఎంచుకోవడం కూడా చాలా ముఖ్యం. పిల్లల శరీరానికి సరిగ్గా సరిపోయే బ్యాగ్‌ను ఎంచుకోవాలి. రెండు వెడల్పాటి, ప్యాడింగ్ ఉన్న భుజాల పట్టీలు, ప్యాడింగ్ ఉన్న వెనుక భాగం, బరువును సమానంగా ఉపయోగకరంగా ఉంటాయి.

# కల్వకుర్తి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ప్రారంభం



కల్వకుర్తి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి పట్టణంలోని 3వ, 22వ వార్డుల్లో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ పర్యటించారు.ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన అభివృద్ధి పనుల్లో భాగంగా 3వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, 22వ వార్డులో సీసీ రోడ్డు పనులు చైర్‌పర్సన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కల్వకుర్తి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను చేపడుతున్నాం. అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరుస్తాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కేతావత్ రాము, ఎజాస్, మక్బూల్ తదితర నాయకులు, శివ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లు పట్టివేత



కల్వకుర్తి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి--తిరుపతి హైవే వద్ద, మండల పరిధిలోని లింగసానిపల్లి గ్రామం నుండి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు .వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు."అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు" అని ఎస్ఐ హెచ్చరించారు.

# తిప్పర్తి మోడల్ స్కూల్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే
## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



తిప్పర్తి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):తిప్పర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. సీనియర్ ఇంటర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఘన స్వాగతం పలుకుతూ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కళాశాల వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎస్సై ఇ. రవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "సెల్‌ఫోన్లు, వాట్సాప్ చాటింగ్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. చదువుతో పాటు మంచి అలవాట్లు పెంపొందించుకోవాలి" అని సూచించారు.ప్రిన్సిపాల్ ఏ. అపర్ణ మాట్లాడుతూ, విద్యార్థులు ఆటపాటలతో పాటు చదువులోనూ రాణించాలని, ఉపాధ్యాయులు బోధించే విషయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రతి ఒక్కరూ తమ జీవిత లక్ష్యాలను చేరుకునేలా కష్టపడి చదవాలని సూచించారు. "విద్య నేర్పిన ఉపాధ్యాయులకు, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆమె అన్నారు.ఈ సందర్భంగా గత సంవత్సరం తెలుగులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయుడు ఎం. రమేష్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ వేడుకలో కళాశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో మార్మోగింది.

# పంచాయతీ రాజ్ జిల్లా కార్యదర్శిగా ఎస్. జానా రెడ్డి నియామకం



నల్లగొండ, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ పంచాయతీ రాజ్ జిల్లా కార్యదర్శిగా ఎస్. జానారెడ్డి నియమితులయ్యారు.చిట్యాల ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న జానారెడ్డికి బుధవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య, ఉపాధ్యక్షుడు కిరణ్, జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ ఉపాధ్యక్షులు సోమనాథ్, సైదులు, ఫణి, హరిప్రసాద్ పాల్గొన్నారు. యూనియన్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జానారెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# నరసాయిపల్లి చెరువులో అక్రమ మట్టి రవాణా పట్టివేత



మాడుగుల, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మాడుగుల పోలీసు సిబ్బంది నరసాయిపల్లి గ్రామ శివారులో గస్తీ నిర్వహిస్తుండగా చెరువు నుండి అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక జెసిబిని పట్టుకున్నారు.తనిఖీ సమయంలో ట్రాక్టర్లలో చెరువు మట్టి నింపబడినట్లు గుర్తించారు. డ్రైవర్లను అనుమతుల గురించి అడగగా తమ వద్ద ఎలాంటి అనుమతులు లేవని అంగీకరించారు. ట్రాక్టర్ నంబర్లు టీజీ07క్యూ0448, ఏపీ22ఏఈ9655గా ఉండగా, డ్రైవర్లు వరుసగా బందెల మధు (మాడుగుల మండలం), కడారి పద్మయ్య (నరసాయిపల్లి)గా గుర్తించారు. యజమానులు రవీందర్ రెడ్డి, బొజ్జ రాజవర్ధన్ రెడ్డిగా ఉన్నారు.
జెసిబి డ్రైవర్ ఇసాన్ అన్సారీ (కొలుకులపల్లి)గా, యజమాని వడ్డేపల్లి యాదయ్యగా గుర్తించారు."ఎటువంటి అనుమతులు లేకుండా చెరువు నుండి మట్టిని అక్రమంగా రవాణా చేసి పర్యావరణానికి హాని చేస్తున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నాం" అని మాడుగుల పోలీస్ స్టేషన్ సిఐ వేణుగోపాల్ తెలిపారు.

# మేడారంలో వనదేవతల దర్శనం చేసుకున్న మండల సర్పంచులు



**ఎలిగేడు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని సర్పంచులు బుధవారం మేడారంలోని శ్రీ సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించుకుని అమ్మవార్లకు ప్రత్యేక మొక్కుబడులు చెల్లించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామాల అభివృద్ధి జరగాలని అమ్మవార్లను వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏలేటి వెంకట్ రెడ్డి, కప్పల ప్రవీణ్, పల్లెర్ల వెంకటేశ్ గౌడ్, సిద్ది తిరుపతి యాదవ్, కొమురయ్య, కవ్వంపల్లి బాపయ్య, రంగు లత--శ్రీనివాస్ గౌడ్, గోపు రజిత--లక్ష్మారెడ్డి, మద్దెల రమాదేవి--సంపత్, రాధ గంగా జమున--వేణుమాధవరావు, దుగ్యాల వాణి--గోపాలరావు, మారం రాయమల్లు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు పొట్యాల రమేశ్ కూడా ఈ దర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. వనదేవతల ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## లోకపేటలో ఆయిల్‌పామ్ తొలికోత రైతు విజయకథ



**ఎలిగేడు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని లోకపేట గ్రామానికి చెందిన రైతు వావిలాల రాజేశ్వరరావు సుమారు 30 ఎకరాల్లో వివిధ దశల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. 2022 డిసెంబరులో నాటిన 17 ఎకరాల తోట మూడు సంవత్సరాల తర్వాత దిగుబడికి చేరుకుని తొలికోత ఆనందాన్ని అందించింది. ఈ సందర్భంగా హార్వెస్టింగ్ కార్యక్రమానికి హెచ్‌ఐవో బి. మహేశ్, సీనియర్ ప్లాంటేషన్ అధికారి ఎన్. అభిలాష్ హాజరై కోత ప్రక్రియను పరిశీలించారు. రైతుకు అవసరమైన సాంకేతిక సూచనలు, సలహాలు అందజేశారు. జూలై నెలలో 10.5 టన్నుల దిగుబడి లభించగా, టన్నుకు రూ. 23,488 ధరతో రూ. 2,46,624 ఆదాయం వచ్చింది. ఆగస్టు నెలలో 14 టన్నుల దిగుబడి లభించి రూ. 3,28,832 ఆదాయం వచ్చింది. రెండు నెలల్లో కలిపి 24.5 టన్నుల దిగుబడితో రూ. 5,75,456 ఆదాయం రైతుకు సమకూరినట్లు హార్టికల్చర్ అధికారులు వెల్లడించారు. మండలంలో ఇప్పటివరకు 30 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని, రైతులు ఈ పంటపై ఆసక్తి చూపుతున్నారని అధికారులు తెలిపారు. ఆయిల్‌పామ్ ఒకసారి నాటితే అనేక సంవత్సరాలపాటు నిరంతర ఆదాయం అందించే పంటగా రైతులకు ఆర్థిక భద్రతను కల్పిస్తుందని వారు పేర్కొన్నారు.

# కల్వకుర్తిలో అమావాస్య అన్నప్రసాదం ఆర్యవైశ్యుల సేవా కార్యక్రమం



**కల్వకుర్తి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "అన్నం పరబ్రహ్మ స్వరూపంతో సమానం. ఆకలితో అలమటించేవారికి వరప్రసాదం లాంటిది. అన్నదానం మహా దానం" అని కల్వకుర్తి పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వాస శేఖర్ అన్నారు. బుధవారం కల్వకుర్తి ఆర్టీసీ బస్ స్టాండ్ ప్రాంగణంలో అమావాస్య సందర్భంగా ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రయాణికులకు ఆకలి తీర్చడం మహోన్నత సేవ అని వాస శేఖర్ పేర్కొన్నారు. ప్రతి అమావాస్య రోజూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా సమాజానికి ఆర్యవైశ్యులు చేస్తున్న సేవ ప్రశంసనీయం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి రైస్ మిల్లర్స్, వ్యాపారవర్గం అందించిన సహకారం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అన్నదాన నిర్వాహకులు గార్లపాటి శ్రీనివాసులు, సభ్యులు గందె రవి, సంబు రమణ, గుబ్బ కిషన్, సంబు ముత్యాలు, రమణాథం, బచ్చు రఘు, బచ్చు సందీప్, కల్వా కిషోర్, రాఘవేందర్, పాపిశెట్టి ప్రసాద్, అప్పాయిపల్లి శ్రీను, గుగ్గిళ్ల శంకర్, కర్ణాకర్తో పాటు ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు పాల్గొన్నారు. ఆర్యవైశ్యుల సేవా కార్యక్రమం వల్ల బస్ స్టాండ్ ప్రాంగణం భక్తి, సేవా వాతావరణంతో నిండిపోయింది.

# విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం

**- బాలరాజ్ గౌడ్ జయంతి వేడుకలు**



**ఆమనగల్లు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చింతల బాలరాజ్ గౌడ్ జయంతిని బుధవారం పురస్కరించుకుని మహేశ్వరం బాలుర ఉన్నత పాఠశాలలో ప్రతిభ పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి, ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బాలరాజ్ గౌడ్ సతీమణి చింతల మంగ, కుమారుడు చింతల నితిన్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, కౌన్సిలర్ పాపిశెట్టి రాము, తుక్కుగూడ హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకులు దార్ల చిత్తరంజన్‌దాస్, జనరల్ సెక్రటరీ వనం విజయ్‌కుమార్, రామన్న మిత్ర మండలి సభ్యులు శ్రీనునాయక్, భుజంగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి నగదు పురస్కారాలు అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## సిఎస్ఐ స్కూల్లో శక్తి యాప్ పై అవగాహన సదస్సు



**నందికొట్కూరు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ ఆర్.ఆర్. నాయక్ సూచనలతో నందికొట్కూరు సర్కిల్ శక్తి టీం సిబ్బంది సిఎస్ఐ అడేడ్ హై స్కూల్‌లో విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ ఎస్. ఖాదర్ భాషా, పీసీ రసూల్ 8, 9, 10వ తరగతి విద్యార్థులు, విద్యార్థినులు, హెడ్‌మాస్టర్ ఎం. రత్నస్వామి, ఉపాధ్యాయులకు శక్తి యాప్, శక్తి వాట్సాప్ నంబర్ 7993485111, ఫోక్సో చట్టాలు, అత్యవసర నంబర్లు 112, 100 గురించి వివరించారు. ప్రత్యేకంగా విద్యార్థినులు స్కూల్‌కు వచ్చేటప్పుడు, వెళ్తున్నప్పుడు ఎవరైనా వెంటపడితే లేదా రాగింగ్ వంటి ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే 181, 1098, 1930 నంబర్ల ప్రాముఖ్యత, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సిబ్బంది, సిఎస్ఐ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 102 తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించిన మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్




**నంద్యాల, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రసవం అనంతరం తల్లి, నవజాత శిశువును సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 102 తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర ప్రచార రథాన్ని కూడా పచ్చజెండా ఊపి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గర్భిణులకు గర్భధారణ ప్రారంభ దశ నుంచే అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రసవం అనంతరం తల్లి--శిశువుల ఆరోగ్య భద్రతకు బేబీ కిట్, ఆర్థిక సహాయం కల్పించడంతో పాటు, వారిని సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని తెలిపారు.

# జగన్ పర్యటనపై పోలీసుల స్పష్టత.. సభలు, ర్యాలీలకు అనుమతి లేదు



**నంద్యాల, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 13న కర్నూలు జిల్లా పర్యటనకు సంబంధించి పోలీసు శాఖ అనుమతులపై జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ స్పష్టత ఇచ్చారు. జైలులో ఉన్న వ్యక్తిని సంబంధిత జైలు అధికారుల నిబంధనల ప్రకారం ములాఖాత్ ద్వారా పరామర్శించేందుకు మాత్రమే అనుమతి వర్తిస్తుందని, బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు, ప్రజా సమావేశాలకు అనుమతి లేదని తెలిపారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి కర్నూలు జైలుకు వెళ్లే సమయంలో పోలీసు భద్రతా ఏర్పాట్లు చేస్తామని, కానీ ప్రజలు, రాజకీయ పార్టీలు, కార్యకర్తలు అనుమతి లేని కార్యక్రమాలు నిర్వహించవద్దని విజ్ఞప్తి చేశారు. పర్యటన సందర్భంగా పోలీసు శాఖ విధించిన షరతులు లేదా చట్టబద్ధమైన నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే, సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ స్పష్టం చేశారు.

# ప్రమాదంలో గాయపడిన వారిని ఆదుకున్న కాటసాని రామభూపాల్





**గడివేముల, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గడివేముల--నంద్యాల రహదారిపై కొరటమద్ది గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోళ్ల బొలెరో వాహనం ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో పలువురు గాయపడ్డారు. ఈ సమయంలో అక్కడుగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ప్రమాదాన్ని గమనించి వెంటనే తన వాహనాన్ని ఆపి క్షతగాత్రుల వద్దకు చేరుకున్నారు. ఆయన తక్షణమే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి, గాయపడిన వారికి వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు.

# కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ వేలంలో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం



**కల్వకుర్తి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ పరిధిలో పట్టుబడిన వాహనాలకు బుధవారం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి వేణుగోపాల్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ వేలంలో మొత్తం 13 ద్విచక్ర వాహనాలు విక్రయించబడ్డాయి. వేలం ద్వారా ప్రభుత్వ ఖజానాకు 2,47,000 ఆదాయం సమకూరినట్లు ఎక్సైజ్ సీఐ జిల్లెల్ల వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది జంగయ్య, జనార్దన్ రెడ్డి, మునిందర్, సిద్ధార్థ, అనిల్, చంద్రశేఖర్, తేజశ్రీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

# కుట్ర ప్రాథమిక పాఠశాలలో డీఈఓ రమేష్‌కుమార్ ఆకస్మిక తనిఖీ



**కల్వకుర్తి, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండలంలోని కుట్ర ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రమేష్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, ప్రాథమిక తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయిని గమనించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై వారికి ఉన్న అవగాహనను తెలుసుకున్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు బలమైన పునాది ఏర్పడేలా బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హాజరు, బోధనకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. "ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలి. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని అభ్యసనలో ముందుకు తీసుకురావాలి" అని డీఈఓ రమేష్‌కుమార్ స్పష్టం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తూ, ప్రాథమిక విద్యను మరింత పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

## మూతపడిన పాఠశాలను తెరిపించాలని గ్రామస్తుల వినతి



**నందికొట్కూరు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరు మండలం కోనేటమ్మపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో మూతపడిన పాఠశాలను తిరిగి ప్రారంభించాలని గ్రామస్తులు ఎంఈఓ రామిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తులు మాట్లాడుతూ పాఠశాల అందుబాటులో లేకపోవడంతో చిన్నారులు ప్రతిరోజూ రెండు కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని, మార్గమధ్యంలో వీధికుక్కలు వెంబడించడం, వర్షాకాలంలో రహదారులు బురదమయంగా మారడం వల్ల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్నారుల భద్రత, సౌకర్యార్థం ఎస్సీ కాలనీలోని పాఠశాలను వెంటనే తెరిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు దామోదర్ రెడ్డి, సంఘ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.ం

## పాణ్యం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు



**నందికొట్కూరు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి కేతవరం గ్రామంలోని మహర్షి వాల్మీకి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, ఆలయానికి సంబంధించిన సమస్యలను స్థానికులు, మహర్షి వాల్మీకి బోయ సంఘం నాయకులతో చర్చించారు. ఆలయానికి శాశ్వత పట్టా మంజూరు చేయడం, ప్రహరీ గోడ నిర్మాణానికి అనుమతులు కల్పించడం వంటి అంశాలను సంఘం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో గ్రామ ప్రజలు, సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓర్వకల్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డి, ఎమ్మెల్యే పీఏ రామలింగారెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఇబ్రహీం, మాజీ సర్పంచ్ బోయ గోవర్ధన్, బోయ కృష్ణ, బోయ వెంకటేశ్వర్లు, బోయ శ్రీను, బోయ వెంకట్, సాయి, పూజారి మద్దిలేటి, పరమేష్, బాలు, గ్రామ మహిళలు కళావతి, పుష్పావతి, భూషమ్మ, పుల్లమ్మతో పాటు యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తక్కువ కాలవ్యవధి పంటలను ఎంచుకోవాలి నున్న వెంకటేశ్వర్లు



**నందికొట్కూరు, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రబీ సీజన్‌లో తక్కువ నీటిని వినియోగించే తక్కువ కాలవ్యవధి పంటలను ఎంచుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారులు సూచించారు. నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, నందికొట్కూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు గిరీష్, ఆర్‌ఎంకే ప్రత్యేకాధికారి శ్రీనివాస్ ఆచార్యులు రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని, నాగటూరు, కొణిదెల, తరిగోపుల, తడిపాడు గ్రామాల్లో ఎండిన పొలాలను పరిశీలించారు. ఎల్ నినో పరిస్థితులు, వర్షాభావం నేపథ్యంలో ఇప్పటికే వేసిన పంటలను రక్షించుకోవడం, ఇంకా పంటలు వేయని రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం గురించి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పిఎండిఎస్ కిట్లు, పెల్లెటైజేషన్ విధానం ద్వారా విత్తనాలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా

## నటి సమంత

నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.

# అసభ్యకరమైన పోస్టులు తొలగించండి

## జాన్వీ కపూర్ పిటిషన్‌పై కోర్టు ఆదేశం

ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, ఎఐ ద్వారా సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆమె తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూప్ జైరామ్ భంభాని కీలక ఆదేశాలు జారీ చేశారు. అసభ్యకరంగా ఉన్న కంటెంట్‌ను, అలాగే ఎవరైనా ఆమె పేరును వాణిజ్యపరంగా దుర్వినియోగం చేస్తుంటే ఆ పోస్టులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పర్సనాలిటీ రైట్స్ అనే భావనకు ఒక సరైన హద్దు ఉండాలని, సెలబ్రిటీల హక్కులను రక్షించడంతోపాటు భావప్రకటన స్వేచ్ఛను కూడా సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అన్ని ఫ్యాన్ పేజీలపై ఒకేసారి నిషేధం విధించలేమని కోర్టు పేర్కొంది. కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఎవరైనా ఆమె పేరును వాడుకుంటేనే కచ్చితంగా చర్యలు తీసుకోవచ్చునని, అయితే అన్ని ఫ్యాన్ పేజీలను నేరపూరితమైనవిగా పరిగణించలేమని తెలిపారు. కొందరు వ్యంగ్యంగా లేదా విమర్శనాత్మక ధోరణిలో కూడా పోస్టులు చేసే అవకాశం ఉందని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఈ కేసులో మెటా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తరఫున ఇప్పటికే 4,000కు పైగా యూఆర్ఎల్‌లను సమర్పించారని, అయితే ఆ కంటెంట్ అంతా ఒకేలా అభ్యంతరకరంగా లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో, ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటెంట్‌ను స్పష్టమైన వర్గాలుగా విభజించి తదుపరి విచారణకు కోర్టు ముందుంచాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు. గతంలో కూడా పలువురు ప్రముఖ నటీనటులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.




# కిమ్స్ ఆసుపత్రిలో ఎన్టీఆర్‌కు విజయవంతంగా సర్జరీ పూర్తి

టాలీవుడ్ అగ్రహీరో జూనియర్ ఎన్టీఆర్‌కు బుధవారం నాడు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. ఆయన భుజానికి వైద్యులు విజయవంతంగా ఆర్థ్రోస్కోపిక్ సర్జరీని నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రస్తుతం ఆయన ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులెటిన్ ద్వారా వెల్లడించాయి. ఇటీవల జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆ సమయంలో వైద్యులు ఆయనకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే, గాయం నుంచి వేగంగా, పూర్తిగా కోలుకోవాలంటే శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సిఫార్సు చేయడంతో నేడు ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స నుంచి ఎన్టీఆర్ పూర్తిగా కోలుకుని, తిరిగి తన వృత్తిపరమైన పనుల్లో నిమగ్నం కావడానికి సుమారు రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు.



# 4న వస్తోన్న క్రైమ్ థ్రిల్లర్ మీర్జాపూర్ మూవీ




భారతీయ ఓటీటీ చరిత్రలో సంచలనం సృష్టించడంతో పాటు అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ మరియు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి గుర్‌మీత్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా, సిరీస్‌లో అదరగొట్టిన ప్రధాన నటీనటులందరూ మళ్లీ పెద్ద తెరపై తమ విశ్వరూపం చూపించడానికి వస్తున్నారు. 'సింహాసనం అనేది రాజకీయాల ద్వారా రాదు, అలా అని వంశపారంపర్యంగానూ రాదు? కేవలం బాహుబలం ఉంటేనే సింహాసనం దక్కుతుంది అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ఆకట్టుకుంటుంది. ఓటీటీలో వెబ్ సిరీస్‌గా ప్రేక్షకులను అలరించిన ఈ నేర ప్రపంచాన్ని, మరింత భారీ హంగులతో, అత్యున్నత నిర్మాణ విలువలతో వెండితెర కోసం మలిచారు. గతంలో సిరీస్‌లో మరణించినట్లు చూపించిన మున్నా భయ్యా (దివ్యేందు) పాత్ర ఈ చిత్రంలో మళ్లీ రీఎంట్రీ ఇస్తుండటం అభిమానులకు అసలైన విందుగా మారనుంది. ఇక మిర్జాపూర్ సింహాసనం కోసం జరిగే పోరులో కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డూ పండిట్ (అలీ ఫజల్) మరియు మున్నా భయ్యా మధ్య జరిగే రక్తపాతంతో కూడిన పోరాటం ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందులతో పాటు శ్వేతా త్రిపాఠి, రసికా దుగ్గల్, అభిషేక్ బెనర్జీ, జితేంద్ర కుమార్, రవి కిషన్ మరియు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# మరోసారి 'చిరు లీక్స్'...

## తన 158వ సినిమా టైటిల్ చెప్పేసిన మెగాస్టార్!



మెగాస్టార్ చిరంజీవి తన రాబోయే సినిమాకు సంబంధించిన కీలకమైన విషయాన్ని అనుకోకుండా బయటపెట్టారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' సక్సెస్ మీట్‌లో తన 158వ సినిమా టైటిల్‌ను ఆయనే స్వయంగా లీక్ చేశారు. దీంతో చజష్త్రఅతీబూమ్ఘఎం అనే హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో మరోసారి వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. కేఎస్ రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో చిరంజీవి తన 158వ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి 'కదిరి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని చిరంజీవి సరదాగా వేదికపై వెల్లడించారు. ఈవెంట్‌లో లీక్‌ల గురించి ప్రస్తావన రాగా, సంగీత దర్శకుడు తమన్ వద్దని వారిస్తున్నా, "టీజర్ మ్యూజిక్ అయ్యిందా? చివర్లో 'కదిరి' అని టైటిల్ పెట్టారా?" అని చిరంజీవి అడగడంతో అసలు విషయం బయటపడింది. అంతేకాదు తన పుట్టినరోజు కానుకగా ఆగస్టు 22న ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు కూడా ప్రకటించారు. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి–బాబీ కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రంలో చిరంజీవి సరసన ప్రియమణి కథానాయికగా నటిస్తుండగా, కన్నడ నటి రచితా రామ్, నివేదా పేతురాజ్, అనశ్వర రాజన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కే నారాయణ, లోకేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

# ఇరుముడి ట్రైలర్ రిలీజ్..

మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నారు.. చివరిగా ఆయన నటించిన మాస్ జాతర, భర్త మహాశయులకు విజ్ఞప్తి ఈ రెండు చిత్రాలు కూడా ఆయనకు పెద్దగా విజయాన్ని అందించలేదు. దీంతో ఆయన ఖాతాలో హిట్ అనివార్యమైంది. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా మంచి సక్సెస్ అందుకోవాలని చూస్తున్న రవితేజ ఏకంగా జానర్ మార్చి 'ఇరుముడి' అనే టైటిల్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆగస్టు 21న ఈ సినిమా విడుదల కాబోతోంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం అప్పుడే ప్రమోషనల్ కార్యక్రమాలు మొదలుపెట్టింది. పైగా సినిమా నుండి ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాండ్ లభించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు. అయ్యప్ప మాలలో ప్రేక్షకులకు ఈసారి మంచి వినోదాన్ని పంచడానికి సిద్ధమైన రవితేజ.. ఈ ట్రైలర్ తో సినిమాపై అంచనాలు పెంచేశారు. తాజాగా విడుదల చేసిన ట్రైలర్లో భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ మేళవింపుగా దీనిని తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది.




# గతంలో జరిగిన తప్పులకు క్షమించండి

## డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లో జానీమాస్టర్

తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార వేడుకలో ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్‌తో తలెత్తిన విభేదాలు మరియు వివాదాల పట్ల జానీ మాస్టర్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. గత కాలపు పొరపాట్లను పక్కనపెట్టి మళ్లీ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించుకున్నామని, కొంతకాలం అసోసియేషన్‌కు దూరంగా ఉన్నప్పటికీ మళ్లీ అందరితో కలిసి పనిచేసేందుకు వచ్చానని ఆయన స్పష్టం చేశారు. ఇకపై అందరం ఒకే కుటుంబంలా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిర్మాతలు ఇచ్చే పారితోషికాలు డ్యాన్సర్లకు పూర్తిగా అందడం లేదనే తీవ్ర ఆవేదనతోనే గతంలో తాను మాట్లాడాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు. ఇదే అంశంపై మెగాస్టార్ చిరంజీవిని కలిసినప్పుడు, ఆయన ఎంతో సానుకూలంగా స్పందించి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో తన మాటల ద్వారా ఎవరికైనా మనస్తాపం కలిగి ఉంటే, లేదా తెలిసీ తెలియక ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే పెద్ద మనసుతో క్షమించాలని ఇండస్ట్రీ పెద్దలను జానీ మాస్టర్ కోరారు. తండ్రి కోప్పడినా చివరికి పిల్లలను దగ్గరకు తీసుకున్నట్లే, సినీ పరిశ్రమ పెద్దలు మరియు నిర్మాతల మండలి డ్యాన్సర్ల అసోసియేషన్‌ను కలుపుకొని ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

